ANDHRAJYOTHY

ఆంధ్రజ్యోతి

5



చిత్తూరు జిల్లా వార్తలు

శనివారం 10 ఫిబ్రవరి 2024

అయ్యయ్యో.. పదవి ఉన్నా పవరు పాయెనే!



చిత్తూరులో నిర్వహించిన ఆసరా కార్యక్రమంలో వైసీపీ ఇన్‌ఛార్జి విజయానందరెడ్డి

ఇంకా పదవుల్లోనే ఉన్నా పాపం ఆ ఎమ్మెల్యేలు ఇద్దరూ అధికారిక కార్యక్రమాల్లో కనిపించడం లేదు. వారి స్థానంలో వైసీపీ నియోజకవర్గ ఇన్‌చార్జులుగా ప్రకటించిన నాయకులు ఆ కార్యక్రమాల్లో పాల్గొంటూ సందడి చేస్తున్నారు. చిత్తూరు, పూతలపట్టు నియోజకవర్గాల్లో ఈ పరిస్థితి నెలకొని ఉంది. చిత్తూరులోని నాగయ్య కళాక్షేత్రంలో శుక్రవారం నాలుగో విడత ఆసరా పథకం డబ్బుల పంపిణీ కార్యక్రమానికి ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు జాడ లేదు. కానీ, నియోజకవర్గ వైసీపీ ఇన్‌చార్జి విజయానందరెడ్డి ముఖ్య అతిథిగా వచ్చారు. మెప్మా మిషన్ డైరెక్టర్ విజయలక్ష్మి, కమిషనరు అరుణ, మెప్మా పీడీ రాధమ్మ తదితర అధికారులు ఆయనకు పుష్పగుచ్ఛాలతో స్వాగతం పలికి గౌరవ మర్యాదలు చేయడం మరీ విశేషం. గతేడాది ఏప్రిల్ 3న ఇదే నాగయ్య కళాక్షేత్రంలో గుడిపాల మండలానికి చెందిన ఆసరా కార్యక్రమానికి ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. నెల నుంచి నియోజకవర్గంలో అన్ని కార్యక్రమాల్లోనూ ఇదే తంతు సాగుతోంది. ఆర్టీసీ వైస్ చైర్మన్ అనే హోదా ఉండడంతో ప్రొటోకాల్ గొడవ కూడా లేదు. ఇక పూతలపట్టు ఎమ్మెల్యే ఎంఎస్ బాబు తనకు టికెట్ లేదని తెలిసినప్పుడు వైసీపీ అధిష్ఠానంపై తీవ్ర స్థాయిలో ఆరోపణలు చేసి, రెండు రోజులకు మాట మార్చినా.. ఆయన స్థానంలో వైసీపీ అధిష్ఠానం మాజీ ఎమ్మెల్యే సునీల్‌కుమార్‌ను ప్రకటించింది. అప్పటి నుంచి ఎంఎస్ బాబు నియోజకవర్గంలో కనిపించకుండా పోయారు. శుక్రవారం బంగారుపాళ్యంలోని కామరాజు గెస్ట్‌హౌస్‌లో అధికారిక హోదా లేకపోయినా వలంటీర్లతో సునీల్‌కుమార్ సమావేశమయ్యారు కూడా. ఈ సమావేశానికి కచ్చితంగా హాజరవ్వాలని మండల అధికారులు వలంటీర్లను ఆదేశించడం విశేషం.



బంగారుపాళ్యంలో నిర్వహించిన వలంటీర్ల సమావేశంలో మాట్లాడుతున్న వైసీపీ ఇన్‌ఛార్జి సునీల్‌కుమార్

\- చిత్తూరు, ఆంధ్రజ్యోతి

పలమనేరు

- తెరపైకి కొత్త పేర్లు
- ధీమాగా వెంకటేగౌడ
- అమరనాథరెడ్డికి దీటైన అభ్యర్థి కోసం వైసీపీ గాలింపు

వైసీపీ అభ్యర్థి ఎవరు?



పలమనేరులో ఈసారి వైసీపీ నుంచి ఎవరు పోటీ చేస్తారనే విషయంపై ఇంకా స్పష్టత లేదనే చెప్పాలి. వైసీపీ విడుదల చేసిన 7 జాబితాల్లోనూ వెంకటేగౌడ పేరు లేకపోవడం, ఈ మధ్య పలువురి పేర్లు ప్రచారంలోకి రావడంతో ఇక్కడ సందిగ్ధం నెలకొంది. ఇదిలా ఉండగా, మాజీ మంత్రి అమరనాథరెడ్డి ఆరు నెలలుగా నియోజకవర్గంలోని ప్రతి ఇంటికి వెళుతున్నారు. ఎన్నికల ప్రచారాన్ని చేసుకుంటున్నారు. ఎక్కడికక్కడ వైసీపీ నాయకులు, కార్యకర్తలు ఆయన సమక్షంలో టీడీపీలోకి చేరుతున్నారు. వెంకటేగౌడ మీద ఆరోపణలు, సర్వేలో వ్యతిరేకత రావడంతో అమరనాథరెడ్డికి దీటైన అభ్యర్థి కోసం వైసీపీ అధిష్ఠానం గాలిస్తున్నట్లు తెలుస్తోంది. - పలమనేరు

ఎమ్మెల్యేపై ఆరోపణలెన్నో?

ఏమాత్రం రాజకీయ నేపథ్యంలేని వెంకటేగౌడ 2019 ఎన్నికల్లో పలమనేరు వైసీపీ అభ్యర్థిగా పోటీచేసి గెలుపొందారు. గెలిచిన ఏడాదిన్నరకే నియోజకవర్గంలోని పలువురు సీనియర్ నాయకుల పట్ల ఎమ్మెల్యే నిర్లక్ష్యం చూపించారు. దీంతో వాళ్లంతా అంటీముట్టనట్లు ఉండిపోయారు. నియోజకవర్గంలో పార్టీ, ప్రభుత్వ నామినేటెడ్ పదవులను అప్పగించడంలోనూ ఎమ్మెల్యే ఏకపక్షంగా వ్యవహరించారనే విమర్శలున్నాయి. శంకర్రాయలపేట చెరువు నుంచి కర్ణాటకకు అక్రమంగా ఇసుక తరలించారని, గొల్లపల్లె సమీపంలో చెల్లని చెక్కుతో క్వారీ కొనుగోలు చేశారని, బలవంతంగా కొందరి క్వారీలను లాక్కున్నారని ఎమ్మెల్యే మీద తీవ్ర ఆరోపణలున్నాయి. చెల్లని చెక్కు వ్యవహారం ఇప్పటికే కర్ణాటక కేజీఎఫ్ కోర్టులో నడుస్తోంది. పలమనేరు సమీప గంటావూరు ఇందిరమ్మ కాలనీలో వైసీపీ నాయకులు ఎమ్మెల్యే అండతోనే పేదల ఇళ్ల స్థలాలు, ఖాళీ స్థలాలను ఆక్రమించుకున్నారనే ఆరోపణలున్నాయి. అలాంటి వారికి వెంకటేగౌడ రాజకీయ పదవులు కట్టబెట్టడం విమర్శలకు దారితీసింది.

తెరపైకి కొత్త పేర్లు..

టీడీపీ నేత సుభాష్‌చంద్రబోస్ ఇటీవల సీఎం జగన్ సమక్షంలో వైసీపీలో చేరిన విషయం తెలిసిందే. పలమనేరు టికెట్ మాట తీసుకునే బోస్ వైసీపీలో చేరారనే ప్రచారం ఊపందుకున్నా.. ఆ తర్వాత ఆయన కూడా సైలెంట్ అయిపోయారు. ఈమధ్య జడ్పీ చైర్మన్ శ్రీనివాసులు కూడా పలమనేరు నుంచి ఎమ్మెల్యేగా పోటీ చేసేందుకు సిద్ధంగా ఉన్నట్లు ప్రకటించారు. ఈయనకు అధిష్ఠానం అండ ఉండడంతోనే అనూహ్యంగా జడ్పీ చైర్మన్ అయిన విషయం తెలిసిందే. మంత్రి పెద్దిరెడ్డి కుటుంబ సభ్యుల్లో ఒకరు పోటీ చేస్తారనే ప్రచారం అప్పట్లో జరిగినా ఇప్పుడు ఆ ప్రస్తావన లేదు. యాదమరి మండలానికి చెందిన ప్రముఖ పారిశ్రామికవేత్త మోహన్‌రెడ్డి పేరు తాజాగా ప్రచారంలోకి వచ్చింది. ఈయన జడ్పీ వైస్ చైర్మన్ ధనుంజయరెడ్డికి సోదరుడు. పూతలపట్టు నియోజకవర్గంలో వైసీపీ అభ్యర్థుల ఎంపిక, గెలుపు విషయాల్లో మోహన్‌రెడ్డి కీలకపాత్ర పోషిస్తూ వస్తున్నారు. 2019 ఎన్నికల్లోనూ మోహన్‌రెడ్డి పేరు పలమనేరు నుంచి ప్రచారం నుంచి వచ్చిన విషయం తెలిసిందే.



విలేకరులతో మాట్లాడుతున్న వెంకటేగౌడ

టికెట్ నా జేబులో ఉంది: ఎమ్మెల్యే

'ఎప్పుడో చెప్పాను కదా.. టికెట్ నా జేబులో ఉందని. ఇప్పుడు కొత్తగా మాట్లాడుతున్నారు' అంటూ పలమనేరు ఎమ్మెల్యే వెంకటేగౌడ వ్యాఖ్యానించారు. సుమారు వారం రోజులుగా వార్తలకు దూరంగా ఉంటున్న ఎమ్మెల్యే.. శుక్రవారం నాయకులు, కార్యకర్తలతో కలిసి పలమనేరులో యాత్ర-2 సినిమా చూశారు. అనంతరం బయటకు వచ్చిన ఆయనతో.. పలమనేరు టికెట్ ఎవరికో వస్తుందని రెండు రోజులుగా ప్రచారం జరుగుతోందన్న అంశాన్ని విలేకరులు ప్రస్తావించారు. దీనిపై ఆయన స్పందిస్తూ.. టికెట్ తన జేబులో ఉందని పేర్కొన్నారు. మరి, జేబులో టికెట్ ఉన్నా.. వైసీపీ అధిష్ఠానం ఏడుసార్లు ప్రకటించిన జాబితాల్లో వెంకటేగౌడ పేరు ఎందుకు లేదబ్బా అంటూ స్థానికంగా చర్చ సాగుతోంది.

వెంకటేగౌడకు టికెట్ ఇస్తే పనిచేయం

ఈసారి వెంకటేగౌడకు టికెట్ ఇస్తే కచ్చితంగా ఓడిస్తామని పెద్దపంజాణి, గంగవరం మండలాల సొంతపార్టీ సీనియర్ నాయకులు చెబుతున్నారు. ఇక, వెంకటేగౌడ సొంత మండలమైన వి.కోటలోనూ ఎమ్మెల్యే వ్యతిరేకవర్గం బలంగా ఉంది. నియోజకవర్గంలోని అన్ని మండలాల్లోనూ వైసీపీకి, ఎమ్మెల్యేకి వ్యతిరేకత బలంగా ఉందనే విషయం తెలుస్తోంది. వైసీపీ చేసుకున్న సర్వేలో వెంకటేగౌడ మీద వ్యతిరేకత ఉందని సమాచారం. దీనికి తోడు నియోజకవర్గంలోని నాయకులు పెద్దిరెడ్డిని కలిసి గౌడకు టికెట్ ఇవ్వద్దని కోరినట్లు తెలుస్తోంది. అందుకే వైసీపీ 7 జాబితాల్లోనూ గౌడకు స్పష్టత ఇవ్వనట్లు ప్రచారం జరుగుతోంది.

ఉభయదారులకు ప్రాధాన్యమేదీ?

- కాణిపాక ఆలయ ఈవో కార్యాలయం ముందు ధర్నా
- చైర్మన్ రాజీనామాకు, ఈవో బదిలీకి డిమాండ్

ఐరాల(కాణిపాకం), ఫిబ్రవరి 9: కాణిపాక ఆలయ అధికారులు తమకు ప్రాధాన్యం ఇవ్వడం లేదని 14 గ్రామాల ఉభయదారులు ఆగ్రహం వ్యక్తం చేశారు. పాలకమండలి, అధికారుల తీరును నిరసిస్తూ శుక్రవారం ఈవో కార్యాలయం ముందు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఉభయదారులు మాట్లాడుతూ.. తొలినాళ్లలో ఆలయ అభివృద్ధికి తాము ఎంతో పాటుపడ్డామని గుర్తుచేశారు. ఆలయంతో ఉభయదారులకున్న అనుబంధం, ప్రాధాన్యాన్ని వివరించారు. ఇటీవల ధర్మకర్తల మండలి చైర్మన్ మోహన్ రెడ్డి, ఈవో వెంకటేశు కలసి తమకు సమాచారం ఇవ్వకుండా ఆలయ చరిత్ర గ్రంథాన్ని ఆవిష్కరించిన విషయంపై ఉభయదారులు ఆగ్రహం వ్యక్తంచేశారు. ఆ గ్రంథంలో ఉభయదారుల ప్రస్తావన లేకపోవడంపై వారు ఆవేదన వ్యక్తం చేశారు. ఆలయంలో ఉభయదారుల ఉనికి లేకుండా చేయడానికి ఈవో, చైర్మన్ ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. తక్షణమే ఈవో, చైర్మన్ క్షమాపణ చెప్పాలని డిమాండు చేశారు. తన పదవికి చైర్మన్ రాజీనామా చేయాలని, ఈవోను బదిలీ చేయాలన్నారు. అంతవరకు తాము ధర్నాను విరమించేది లేదని భీష్మించుకొని కూర్చున్నారు.



ఈవో కార్యాలయం ముందు ధర్నా చేస్తున్న ఉభయదారులు

ధర పది.. అమ్మేది వంద!



- డిమాండును సొమ్ము చేసుకుంటున్న ఈ-స్టాంపింగ్ నిర్వాహకులు

చిత్తూరు కలెక్టరేట్, ఫిబ్రవరి 9: సార్వత్రిక ఎన్నికలు వస్తున్న నేపథ్యంలో పేదలపై ప్రభుత్వం ప్రేమ చూపుతోంది. ఇన్నాళ్లు లేనిది.. ఇప్పుడు ఒక్కసారిగా 36వేల ఇళ్ల పట్టాలను రిజిస్ట్రేషన్లు చేయాలని నిర్ణయించింది. ఈ మేరకు సచివాలయాలకు అధికారమిచ్చింది. దీంతో ఈ-స్టాంపింగ్ కాగితాలకు విపరీతమైన డిమాండు పెరిగింది. సాధారణ నాన్-జ్యుడీషియల్ స్టాంపులన్నీ సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాల్లో ఖాళీ అయ్యాయి. ఇదే అదనుగా కొన్ని ఈ-స్టాంపింగ్ ఏజెన్సీలు రూ.పది స్టాంపును దాదాపు వంద రూపాయలకు విక్రయిస్తున్నాయి. జిల్లా పరిధిలోని ఎనిమిది సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాల పరిధిలో 71 ఏజెన్సీలకు స్టాంపుల అమ్మకాన్ని ప్రభుత్వం ప్రైవేటు పరం చేసింది. ఈ-స్టాంపింగ్ పేపర్లు అమ్మకాలు చేయాలంటే అఫిడవిట్లు తీసుకుని విక్రయించాలి. ఏజెన్సీల్లో కొన్ని బ్యాంకులు, పోస్టాఫీసుల్లోనూ ఈ సేవలు అందుబాటులో ఉన్నాయి. బ్యాంకులు, పోస్టాఫీసులు మినహాయిస్తే ప్రైవేటుగా ఈ-స్టాంపులు విక్రయించే 40కి పైగా ఏజెంట్లు, ఏజెన్సీలు ఇష్టారాజ్యంగా రుసుములు వసూలు చేస్తున్నాయి. చిత్తూరు అర్బన్, రూరల్ రిజిస్ట్రేషన్ కార్యాలయాల వద్ద, పాత జిల్లా కోర్టు సమీపంలోని గాంధీ రోడ్డులో కొందరు వెండర్లు కాసుల పంట పండించుకుంటున్నారు. ప్రజల నుంచి వచ్చే డిమాండ్లను బట్టి రూ.10 స్టాంపును రూ.50, రూ.100 వరకు పబ్లిక్‌గా విక్రయిస్తున్నారు. అధిక ధరలకు విక్రయిస్తున్నా, రిజిస్ట్రేషన్ శాఖ అధికారులు పట్టించుకోవడం లేదు. ప్రస్తుతం పేదలందరికీ ఇళ్లు పథకంలో భాగంగా 36,021 ఇళ్ల స్థలాల పట్టాలకు సచివాలయాల్లో వారం రోజులుగా రిజిస్ట్రేషన్ ప్రక్రియ కొనసాగుతోంది. ఈ ప్రక్రియ మరో వారం రోజుల వరకు కొనసాగే అవకాశం ఉంది. ఇళ్లపట్టాల రిజిస్ట్రేషన్‌కు రూ.10 స్టాంపు అవసరం. వీటిని ప్రైవేటు వెండర్లు ఐదింతలు, పదింతలు పెంచి బాహాటంగా విక్రయిస్తున్నారు. పేద లబ్ధిదారులు వెండర్లు అడిగిన డబ్బులిచ్చి తప్పనిసరి పరిస్థితుల్లో కొనుగోలు చేస్తున్నారు. సందిట్లో సడేమియాగా ఏజెంట్లు, ఏజెన్సీలు అధిక ధరలకు అమ్ముతూ జేబులు నింపుకుంటున్నారు. జిల్లా ఉన్నతాధికారులు ఏజెన్సీలపై, వెండర్ల దుకాణాలపై మెరుపుదాడులు చేసి, అధిక ధరలకు స్టాంపులను విక్రయించేవారి లైసెన్సులను రద్దు చేయాలని లబ్ధిదారులు కోరుతున్నారు.

మరో వికెట్ అవుట్

- డూప్లికేట్ ఓటరు కార్డుల వ్యవహారంలో తిరుపతి మున్సిపల్ పూర్వ డీసీపై వేటు
- ఈసీ నియమించకనే ఈఆర్వోగా వ్యవహరించిన చంద్రమౌళీశ్వరరెడ్డి
- ఈసీ విచారణలో వెలుగు చూసిన వైనం

తిరుపతి లోక్‌సభ నియోజకవర్గ ఉప ఎన్నికల్లో డూప్లికేట్ ఓటరు కార్డులు సృష్టించిన వ్యవహారంలో నాలుగో వికెట్ పడింది. తిరుపతి మున్సిపల్ డిప్యూటీ కమిషనర్‌గా పనిచేస్తూ ఇటీవలే బదిలీపై వెళ్లిన చంద్రమౌళీశ్వరరెడ్డి మీద డూప్లికేట్ ఓటరు కార్డుల వ్యవహారంలో ఎన్నికల కమిషన్ సస్పెన్షన్ వేటు వేసింది. 2021 మార్చి, ఏప్రిల్ నెలల్లో జరిగిన తిరుపతి లోక్‌సభ నియోజకవర్గ ఉప ఎన్నికల సందర్భంగా చంద్రమౌళీశ్వరరెడ్డి ఎన్నికల కమిషన్ నియమ నిబంధనలను ఉల్లంఘించి అడ్డగోలుగా వ్యవహరించారని తేలడంతో ఎన్నికల కమిషన్ ఈ చర్యలు తీసుకుంది. కాగా తిరుపతి ఉప ఎన్నికల్లో జరిగిన అక్రమాలపై విచారణలో భాగంగా అప్పటి మున్సిపల్ కమిషనర్, అన్నమయ్య జిల్లా కలెక్టర్ గిరీశాతో మొదలైన సస్పెన్షన్ల పరంపరలో ఈయన నాలుగో వ్యక్తి.

తిరుపతి, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): తిరుపతి లోక్‌సభ ఉప ఎన్నికల సందర్భంగా చోటుచేసుకున్న అక్రమాలు ఒకటొకటే వెలుగు చూస్తున్నాయి. ఎన్నికల కమిషన్ విచారణలో విస్తుపోయే వాస్తవాలు తెలుస్తున్నాయి. అందులో కీలకమైంది ఎన్నికల కమిషన్ నియమించకుండానే చంద్రమౌళీశ్వరరెడ్డి ఈఆర్వోగా వ్యవహరించడం. లోక్‌సభ ఉపఎన్నికల సమయంలో ఎన్నికల కమిషన్ నిజానికి అయనను తిరుపతి పార్లమెంటు నియోజకవర్గానికి ఏఆర్వోగా, తిరుపతి అసెంబ్లీ సెగ్మెంట్‌కు ఆర్వోగా నియమించింది. ఆ మేరకు 2021 మార్చి 17న గెజిట్ నోటిఫికేషన్ జారీ అయింది. అంతేతప్ప తిరుపతి అసెంబ్లీ సెగ్మెంట్‌కు ఈఆర్వోగా ఆయన్ను నియమిస్తూ ఎన్నికల కమిషన్ నోటిఫై చేయలేదు. అయినా ఆయన తిరుపతి అసెంబ్లీ సెగ్మెంట్‌కు ఈఆర్వోగానూ పనిచేశారు. ఆహోదాలో ఆయన పేరు, ఫోన్ నంబరు ఈఆర్వో ప్రొఫైల్‌లో నమోదు కావడాన్ని బట్టి ఓటరు కార్డుల డౌన్‌లోడ్‌కు సంబంధించిన అక్రమాలకు ఆయన్ను బాధ్యుడిగా ఎన్నికల కమిషన్ పరిగణిస్తోంది. ఎలాంటి క్లెయిమ్ ఫామ్‌లూ అందకుండానే సుమారు 35 వేల ఓటరు కార్డులను డౌన్‌లోడ్ చేసిన వ్యవహారంలో ఇతడి పాత్రను పోలీసు దర్యాప్తులో నిర్ధారించాల్సి వుందని ఇతని సస్పెన్షన్ ఉత్తర్వుల్లో ఎన్నికల కమిషన్ పేర్కొంది. కాగా తిరుపతి లోక్‌సభ ఉప ఎన్నికల అక్రమాలకు అప్పటి తిరుపతి అసెంబ్లీ సెగ్మెంట్ ఆర్వోగా వ్యవహరించిన నాటి మున్సిపల్ కమిషనర్, ఇటీవల వరకూ అన్నమయ్య జిల్లా కలెక్టర్‌గా పనిచేసిన గిరీశా తొలుత చర్యలకు గురయ్యారు. ఈ వ్యవహారంపై విచారణ జరిపిన ఈసీ గత నెలలో ఆయన్ను సస్పెండు చేసింది. ఆపై వారానికే నాటి తిరుపతి అర్బన్ తహసిల్దారు, ఎలక్షన్ డీటీలను సస్పెండ్ చేసింది. అప్పట్లో ఆ కార్యాలయంలో పనిచేసిన కంప్యూటర్ ఆపరేటర్లు ముగ్గురినీ విధుల నుంచీ తొలగించారు. ఈఆర్వో నెట్ నుంచీ ఓటరు కార్డులు డౌన్ లోడ్ చేసిన వ్యవహారంపై ఈస్ట్, వెస్ట్ పోలీస్ స్టేషన్లలో క్రిమినల్ కేసులు నమోదయ్యాయి. ఈ కేసుల విచారణ ఒక కొలిక్కి రాకముందే చంద్రమౌళీశ్వరరెడ్డిని శుక్రవారం సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయి. మిగిలిన వారి కంటే ఈయన వ్యవహారం భిన్నంగా మారింది.



అక్రమంగా ఓటరు కార్డులు డౌన్‌లోడ్ చేసిన ఆరోపణలను ఎదుర్కోవడం ఒక ఎత్తయితే అసలు ఎన్నికల కమిషన్ నియమించకుండానే తనకు తానుగా ఈఆర్వోగా బాధ్యతలు నిర్వహించడమనేది అంతకు మించిన తప్పుగా మారుతోంది. కడప జిల్లాకు చెందిన ఈ అధికారికి ఇతరత్రా నిజాయితీపరుడనే పేరుంది. అయితే అధికారిగా ప్రజాప్రతినిధుల ఒత్తిడికి సులువుగా తలొగ్గుతారని, వారు చెప్పిన పనులు నిబంధనలకు విరుద్ధంగా వున్నా సరే అమలు చేస్తారన్న పేరుంది. దానివల్ల వచ్చే పరిణామాలకు ఆయనే బాధ్యుడవుతుండగా ఇతర అధికారుల తరహాలో అక్రమార్జనకు పాల్పడడం వంటి ఆరోపణలు లేకపోవడం గమనార్హం.దీంతో సస్పెన్షనకు గురైన చంద్రమౌళీశ్వరరెడ్డిపై అధికార, ఉద్యోగ వర్గాల నుంచీ సానుభూతి వ్యక్తమవుతోంది. ప్రస్తుతం ఆయన బదిలీపై విజయవాడలో మెప్మా డైరెక్టరేట్‌లో డిప్యూటీ డైరెక్టర్‌గా పనిచేస్తున్నారు. ఈ విషయమలా వుంచితే ఈసీ తదుపరి చర్యలు ఎవరి మెడకు చుట్టుకుంటాయోనన్న భయం సంబంధిత అధికారులను, ఉద్యోగులను వెంటాడుతోంది. మరోవైపు పోలీసుల దర్యాప్తులో ఏమి తేలుతుందో, ఎవరు జైలుకు వెళ్లాల్సివస్తోందోనని ఈ వ్యవహారంలో పాలుపంచుకున్న అధికారులు, ఉద్యోగులు హడలిపోతున్నారు.

శరణు.. శరణు.. చెంగన్నా!

ది గ్రాండ్ ఓల్డ్ పార్టీ కాంగ్రెస్‌లో .... ది గ్రాండ్ ఓల్డ్ పొలిటీషియన్‌గా పేరున్న మాజీ మంత్రి చెంగారెడ్డిని నగరి ఎమ్మెల్యే, రాష్ట్ర మంత్రి ఆర్‌కే రోజా తరచూ ఏదో ఒక సందర్భం పేరుతో కలుస్తుండడం నియోజకవర్గంలో చర్చనీయాంశంగా మారింది. జనవరి 13న జన్మదినం సందర్భంగా నగరిలోని షిరిడీ సాయిబాబా ఆలయంలో చెంగారెడ్డిని కలిసి రోజా శుభాకాంక్షలు తెలిపారు. ఈ ఐదేళ్లలో అంతకు మునుపు ఏ పుట్టినరోజునా ఆమె ఇలా కలవలేదు. రెండు రోజుల కిందట మళ్లీ ఆయనను కలిసి నగరిలోని దేశమ్మ ఆలయ కుంభాభిషేకానికి ఆహ్వానించారు. 2014 సార్వత్రిక ఎన్నికల తరువాత ఒకరకంగా అస్త్రసన్యాసం చేసిన చెంగారెడ్డి మీద హఠాత్తుగా ఎన్నికల ఏడాది మాత్రమే ఈ గౌరవాభిమానాలు ప్రకటించడం వెనుక ఏముందనే చర్చ నడుస్తోంది. నియోజకవర్గవ్యాప్తంగా ఎలా ఉన్నప్పటికీ ప్రధానంగా సొంత మండలం నిండ్రలో చెంగారెడ్డిని అభిమానించే నాయకులు, కార్యకర్తలు ఇప్పటికీ ఉన్నారు. అలాగే నిండ్ర మండలంపై చెంగారెడ్డి అన్న కుమారుడు శ్రీశైలం ట్రస్ట్ బోర్డు చైర్మన్‌గా ఉన్న రెడ్డివారి చక్రపాణిరెడ్డికి బలమైన పట్టుంది. స్థానిక సంస్థల ఎన్నికల్లో మొత్తం 7 ఎంపీటీసీలకుగాను ఐదింట చక్రపాణిరెడ్డి మద్దతుదారులు వైసీపీ తరఫున పోటీచేసి గెలిచారు. నిండ్ర జడ్పీటీసీ మల్లీశ్వరి కూడా చక్రపాణిరెడ్డి వర్గమే. అయితే చక్రపాణిరెడ్డి వైసీపీలోనే ఉన్నా రోజాకు బద్ధ వ్యతిరేకిగా ఉన్నారు. నిండ్ర ఎంపీపీ కాకుండా తన తమ్ముడు భాస్కరరెడ్డి ని రోజా అడ్డుకున్న తీరు ఆయనలో తీవ్ర వ్యతిరేకతను పెంచింది. అన్న చెంగారెడ్డితో అంటీముట్టనట్టుగా వుండిన చక్రపాణిరెడ్డి మంత్రి రోజాతో వి భేదాల తర్వాత ఆయనతో సంబంధాలను పునరుద్ధరించుకున్నారు. ఎంపీపీ ఎన్నిక తర్వాత రెడ్డివారి కుటుంబం రోజాకు వ్యతిరేకంగా మారిం ది. ఈ నేపథ్యంలోనే నిండ్ర మండలంలో చక్రపాణిరెడ్డి పట్టును సడలించాలంటే చెంగారెడ్డిని ప్రసన్నం చేసుకోవడం తప్ప మరో మా ర్గం లేదనే అభిప్రాయానికి వచ్చిన మంత్రి రోజా తరచూ ఆయనను కలిసి ప్రసన్నం చేసుకునే ప్రయత్నం చేస్తున్నారనే ప్రచారం జరుగుతోంది. - పుత్తూరు అర్బన్



కులగణనను వేగవంతం చేయాలి: జేసీ

చిత్తూరు కలెక్టరేట్, ఫిబ్రవరి 9: జిల్లాలో రెండు వారాలుగా చేపట్టిన కులగణను వేగవంతం చేయాలని జేసీ శ్రీనివాసులు సూచించారు. శుక్రవారం ఆయన తన ఛాంబర్ నుంచి ఆర్డీవోలు, తహసీల్దార్లు, ఎంపీడీవోలతో వీడియోకాన్ఫరెన్స్ (వీసీ) నిర్వహించారు. కులగణన ఇప్పటి వరకు 92 శాతం పూర్తి కాగా, ఈనెల 15 స్థానిక విజ్ఞాన సుధ డిగ్రీ కళాశాలలో జరిగే మెగా జాబ్ మేళా ద్వారా ఆరు వేల పోస్టుల భర్తీకి ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. డీఆర్వో పులయ్య, స్కిల్ డెవలప్‌మెంట్ అధికారి గుణశేఖర్, డీపీవో లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

దేవదాయశాఖ ఏసీగా ప్రసన్నలక్ష్మి బాధ్యతల స్వీకరణ

చిత్తూరు రూరల్, ఫిబ్రవరి 9: చిత్తూరు దేవదాయశాఖ శాఖ అసిస్టెంట్ కమిషనరు (ఏసీ)గా ప్రసన్నలక్ష్మి శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ ఏసీగా పనిచేస్తున్న ఏకాంబరానికి డీసీగా పదోన్నతి అభించింది. ఆయ స్థానంలో కర్నూలు జిల్లాలో గ్రేడ్-1 ఈవో పనిచేస్తున్న ప్రసన్నలక్ష్మిని పదోన్నతిపై నియమించారు. ఈమెను అధికారులు సుమన ప్రియ, వెంకటేశ్వర్లు, శ్వేత, రూప, రాధిక, రవికుమార్ తదితరులు సన్మానించారు.

హైవేరోడ్డు పనుల్లో క్రేన్‌కిందపడి వ్యక్తి మృతి


మృతి చెందిన గులాబ్

గంగాధరనెల్లూరు, ఫిబ్రవరి 9: గంగాధరనెల్లూరు మండలం కండిగ వద్ద హైవే పనుల్లో క్రేన్‌కిందపడి ఓ వ్యక్తి మృతి చెందిన సంఘటన శుక్రవారం చోటుచేసుకుంది. ముక్కళత్తూరు పంచాయతీ కండిగ గ్రామ సమీపంలో చిత్తూరు- తచ్చూరు జాతీయ రహదారి పనులు జరుగుతున్నాయి. ఈ సందర్భంగా కార్మికుడు గులాబ్ అలీయాస్ గులా(48) ప్రమాదవశాత్తు క్రేన్ కింద పడ్డారు. ఆయన్ను కాంట్రాక్ట్ సిబ్బంది వెంటనే చిత్తూరు ప్రభుత్వాసుపత్రికి తరలించగా, అప్పటికే మృతిచెందినట్లు ధృవీకరించారని తెలిపారు. సీఐ శంకర్‌ను శుక్రవారం రాత్రి వివరణ కోరగా హైవే కాంట్రాక్ట్ సిబ్బంది నుంచి తమకు ఇంకా ఎలాంటి ఫిర్యాదు అందలేదన్నారు. అయితే హైవేపనుల్లో పనిచేసే కార్మికుడు గులాబ్ మృతదేహం మార్చురిలో ఉన్నట్లు చిత్తూరు ఆస్పత్రి నుంచి సమాచారాన్ని అందజేశారన్నారు. ఫిర్యాదు అందితే శనివారం పోస్టుమార్టమ్ చేయిస్తామన్నారు.

విద్యుత్తు తీగలు తెగి ఆగిన రైళ్లు



కుప్పం, ఫిబ్రవరి 9: తమిళనాడు రాష్ట్రం జోలార్‌పేట రైల్వే స్టేషన్ సమీపంలో రైల్వేకు సంబంధించిన విద్యుత్ తీగలు తెగి పడ్డాయి. దీంతో చెన్నై-బెంగళూరు మార్గంలో నడుస్తున్న రైళ్లు ఎక్కడికక్కడ ఆగిపోయాయి. బెంగళూరు నుంచి కొచ్చివెల్లి వెళ్లే రైలు కుప్పం స్టేషన్లో ఆగిపోయింది. దీంతో ప్రయాణికులు తీవ్ర అవస్థలు పడ్డారు.

రేపు సీసీఎల్ టీ20 క్రికెట్ సెలక్షన్స్

తిరుపతి(కొర్లగుంట), ఫిబ్రవరి 9: చిత్తూరు క్రికెట్ లీగ్(సీసీఎల్) టీ20 సెలక్షన్స్ ఆదివారం నిర్వహించనున్నట్లు చిత్తూరు జిల్లా బాయ్స్ అండ్ గర్ల్స్ క్రికెట్ అసోసియేషన్ అధ్యక్షుడు శ్రీనివాసులు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. తిరుపతిలో తుమ్మలగుంట మైదానం, చిత్తూరులో పోలీస్ పరేడ్ గ్రౌండ్, మదనపల్లిలో మాస్టర్‌మైండ్ స్కూల్ ఎదురుగా ఉన్న మైదానంలో ఎంపిక ప్రక్రియ ఉంటుందని పేర్కొన్నారు. 1994 సెప్టెంబరు 1 నుంచి 2008 సెప్టెంబరు 1న మధ్య జన్మించిన వారు అర్హులని, ఆసక్తిగలవారు తెల్లని దుస్తులు, క్రీడా సామగ్రితో హాజరుకావాలని వివరించారు. మరింత సమాచారం కోసం 9849026131(తిరుపతి), 9014440543(చిత్తూరు), 7013031459(మదనపల్లె)లను సంప్రదించాలని కోరారు.

పీవీకి 'భారతరత్న' ఇవ్వడం హర్షణీయం


పీవీ పక్కన చీఫ్ సెక్యూరిటీ ఆఫీసర్ హోదాలో చిన్నస్వామి (ఫైల్‌ఫొటో)

గంగాధరనెల్లూరు, ఫిబ్రవరి 9: మాజీ ప్రధానమంత్రి, దివంగత పి.వి.నరసింహారావుకు కేంద్ర ప్రభుత్వం భారతరత్నను ప్రకటించడం చాలా సంతోషకరంగా ఉందని ప్రధానమంత్రి రిటైర్డ్ చీఫ్ సెక్యూరిటీ ఆఫీసర్ పి.చిన్నస్వామి పేర్కొన్నారు. గంగాధరనెల్లూరు మండలం వేపంజేరి పంచాయతీ గోవింద రెడ్డిపల్లెకు చెందిన ఈయన శుక్రవారం మాట్లాడారు. ప్రధానమంత్రిగా పేరు ప్రఖ్యాతులు గడించిన పి.వి.నరసింహారావు వద్ద తాను సెక్యూరిటీ ఆఫీసర్‌గా పనిచేయడం గర్వకారణంగా ఉందన్నారు. ఆర్థిక వేత్త, బహుభాషా కోవిదుడు, రాజనీతిజ్ఞుడు, తెలుగువారైన నరసింహారావుకు అత్యున్నత పురస్కారం రావడం గర్వించదగ్గ విషయమన్నారు.

డ్వాక్రా గ్రూపులో రూ.4 లక్షల స్వాహా

కలెక్టర్‌కు సభ్యుల ఫిర్యాదు

సోమల, ఫిబ్రవరి 9: పెద్దమ్మ తల్లి వెలుగు గ్రూపులో సభ్యులకు తెలియకుండా ఓ సభ్యురాలు రూ.4లక్షలు మేరకు స్వాహా చేసిందని ఆ సంఘ సభ్యులు శుక్రవారం కలెక్టర్ షన్మోహన్‌కు ఫిర్యాదు చేశారు. సోమల హైస్కూల్‌లో మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి చేతులమీదుగా ఆసరా చెక్కుల పంపిణీ కార్యక్రమం జరిగింది. జిల్లా కలెక్టర్ షన్మోహన్ పాల్గొన్నారు. సభానంతరం ప్రజల నుంచి మంత్రి వినతులు స్వీకరించారు. సోమల మండలం భారతంమిట్టకు చెందిన పెద్దమ్మ తల్లి డ్వాక్రా సంఘంలో 10 మంది సభ్యులున్నారు. వారు నిరక్షరాసులు కావడంతో వీరిలో ఓ సభ్యురాలు పుస్తక నిర్వహణ, బ్యాంకు లావాదేవీ చేస్తూ సభ్యులకు తెలియకుండా సంతకాలు పెట్టించుకుని రూ. 4లక్షలు మేరకు స్వాహా చేసింది. ఈ విషయం తెలుసుకున్న 9 మంది సభ్యురాళ్లు అధికారులు, బ్యాంకు అధికారులకు, పోలీసులకు ఫిర్యాదు చేశారు. సమస్య పరిష్కారం కాకపోవడంతో శుక్రవారం సభకు హాజరైన కలెక్టర్‌కు తమ సమస్యను వివరించారు. దీంతో ఆయన స్పందించి 13వ తేదీ మంగళవారం చిత్తూరు కార్యాలయానికి సభ్యులందరూ ఏపీఎం శివతో కలసి రికార్డులతో రావాలని ఆదేశించారు.

చిరుధాన్యాల ఉత్పత్తికి ప్రాధాన్యం

వచ్చే ఆర్థిక సంవత్సరం నుంచి పంటరుణాల పెంపునకు సిఫార్సు

చిత్తూరు కలెక్టరేట్, ఫిబ్రవరి 9: చిరుధాన్యాల వినియోగంపై ప్రజల్లో పెరుగుతున్న ఆసక్తిని గుర్తిస్తూ, వాటి ఉత్పత్తికి జిల్లా టెక్నికల్ కమిటీ ప్రాధాన్యమిచ్చింది. 2024-25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి చిరుధాన్యాల ఉత్పత్తికి పంటరుణ పెంపునకు సిఫార్సు చేసింది. చిత్తూరులోని డీసీసీబీ ప్రధాన కార్యాలయంలో వివిధ బ్యాంకు, జిల్లా వ్యవసాయ అనుబంధ శాఖల అధికారులతో శుక్రవారం జరిగిన సమావేశంలో ప్రతిపాదన సిద్ధం చేశారు. కొర్రలు, సామలు తదితర చిరుధాన్యాల పంటలకు ఎకరాకు రూ.12వేలు బ్యాంకు రుణాలు ఇస్తుండగా, దీనిని వచ్చే ఆర్థిక సంవత్సరం నుంచి రూ.22 వేలకు పెంచేలా కమిటీ సిఫార్సు చేసింది. అలాగే, మినుములు, పెసలు, ఉలవలు, ఇతర చిరుధాన్యాల రుణాలనూ రూ.22 వేలకు పెంచుతూ కమిటీ తీర్మానించింది. హైబ్రిడ్ రకం వరికి ఇస్తున్న రూ.42వేలను రూ.47వేలకు, శ్రీవరిసాగుకు రూ.32 వేల నుంచి రూ.35వేలకు, చెరకు (ప్లాంటేషన్)కు రూ.80 వేల నుంచి రూ.85వేలకు, నీటి ఆధారిత వేరుశనగ పంటకు రూ.32వేల నుంచి రూ.35వేలకు పెంచుతూ సిఫార్సు చేసింది. రాగులుకు ప్రస్తుతం పొడి, తడి నేలలో సాగుకు ఇస్తున్న రూ.16వేలు, రూ.18 వేల రుణాలను రూ.22 వేలకు, సజ్జలు, జొన్నలు తడి, పొడి నేలల్లో పంటసాగుకు రూ.15 వేల నుంచి రూ.22 వేలకు పెంచింది. మామిడి, మల్బరీ, పత్తి, టమోట, ఉల్లిపాయ, ఉర్లగడ్డ, మునక్కాయ, పపాయ, వంకాయ, బెండకాయ, ఫ్రెంచిబీన్స్, కర్బూజా, క్యాబేజి పంటలకిచ్చే రుణాల్లో ఎలాంటి మార్పు చేయలేదు. ఎకరా మిరప పంటకు మాత్రం రుణాన్ని రూ.85వేల నుంచి రూ.75వేలకు తగ్గించింది. ఇక, ఆకు కూరల పంటలకు రూ.10వేలనుంచి రూ.20వేలకు, దనియాలకు రూ.20వేల నుంచి రూ.25 వేలకు పెంచింది. ఈ సిఫార్సులకు రాష్ట్రస్థాయి కమిటీ ఆమోదం పొందాక ఏప్రిల్ ఒకటి నుంచి అన్ని బ్యాంకులు అమలు చేస్తాయని డీసీసీబీ సీఈవో మనోహర్ గౌడ్ తెలిపారు. ఎల్డీఎం హరీష్, నాబార్డు డీడీఎం సునీల్, వ్యవసాయశాఖ జేడీ మురళీకృష్ణ, పశుసంవర్ధక శాఖ జేడీ ప్రభాకర్, హార్టికల్చర్ జేడీ మధుసూదన్, సెరికల్చర్ జేడీ శోభారాణి తదితరులు పాల్గొన్నారు.

శ్రీవారి హుండీ ఆదాయం రూ.3.52 కోట్లు

తిరుమల, ఫిబ్రవరి9(ఆంధ్రజ్యోతి): తిరుమల వేంకటేశ్వరస్వామి హుండీ ఆదాయం రూ.3.52 కోట్లు లభించింది. బుధవారం ఉదయం నుంచి రాత్రి వరకు భక్తులు సమర్పించిన హుండీ కానుకలను టీటీడీ గురువారం లెక్కించి శుక్రవారం ఉదయం ప్రకటించింది. ఇక, గురువారం 57,357 మంది భక్తులు శ్రీవారిని దర్శించుకున్నారు. 18,924 మంది తలనీలాలు సమర్పించారు.



పాఠ్యపుస్తకాలు లేకుండా

పరీక్షలకు సన్నద్ధం ఎలా..!

పాలకుల అనాలోచిత నిర్ణయాలతో పేద విద్యార్థులకు తప్పని అవస్థలు

చిత్తూరు(విద్య), ఫిబ్రవరి 9: ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో ఇంటర్మీడియట్ చదివే విద్యార్థులకు ఉచిత పాఠ్యపుస్తకాల పంపిణీలో పాలకుల బాధ్యతారాహిత్యంపై విమర్శలు వినిపిస్తున్నాయి. పుస్తకాలు అందించకుండా మార్చి నెలలో జరిగే పబ్లిక్ పరీక్షలకు విద్యార్థులు ఎలా సన్నద్ధం అవుతారని వారి తల్లిదండ్రులు ప్రశ్నిస్తున్నారు. ఇలాంటి పరిస్థితుల్లో పబ్లిక్ పరీక్షల్లో మెరుగైన ఫలితాలు సాధించాలని కోరుకోవడం అత్యాశే అవుతుందని అధ్యాపకవర్గాలు అంటున్నాయి. విద్యా వ్యవస్థలో విప్లవాత్మక సంస్కరణలు చేపట్టామని పదేపదే చెప్పుకునే సీఎం జగన్ పరిపాలన ఆచరణలో ఎలా ఉందన్నదానికి ఈ ఉచిత పాఠ్యపుస్తకాల పంపిణీయే నిదర్శనంగా నిలుస్తోంది. దాదాపుగా విద్యా సంవత్సరం ముగిసి మరో 20రోజుల వ్యవధిలో అంటే మార్చి ఒకటి నుంచి పబ్లిక్ పరీక్షలు ప్రారంభం కానున్నాయి. చాలామంది విద్యార్థులకు ఇప్పటికీ పుస్తకాలందలేదు. నిజానికి ఏపీలో పుష్కరకాలానికి పైగా ప్రభుత్వ కళాశాలల్లో చదివే విద్యార్థులకు ఏటా ఉచితంగా పాఠ్యపుస్తకాలను అందించేవారు. 2008-09నుంచి 2012-13 వరకు టీటీడీ ఈ పుస్తకాలకు నిధులు ఇవ్వగా.. 2014-2020వరకు ప్రభుత్వం, ఉన్నత విద్యామండలి నిధులతో ఉచిత పాఠ్యపుస్తకాలు ముద్రించి విద్యార్థులకు పంపిణీ చేసేవారు. అయితే రెండేళ్లుగా పాఠ్యపుస్తకాలను పంపిణీ చేయలేదు. ఓల్డ్‌స్టాక్ కింద ఉన్న కొన్ని పుస్తకాలను అరకొరగా విద్యార్థులకు పంపిణీ చేసి చేతులు దులుపుకున్నారు. కొన్ని కాలేజీల్లో ప్రిన్సిపాళ్లే చొరవచూపి సీనియర్ విద్యార్థులకు ఇచ్చిన పాఠ్యపుస్తకాలను తీసి కొంతమందికి సర్దుబాటు చేయగా.. ఎక్కువసంఖ్యలో విద్యార్థులు పాఠ్యపుస్తకాలు లేకుండానే చదువులు పూర్తిచేయాల్సిన పరిస్థితి నెలకొంది. గతేడాది ఉమ్మడి జిల్లాలో ప్రథమ ఇంటర్‌లో 51శాతం ఉత్తీర్ణతతో వెనుకబడి ఒత్తిడిలో ఉన్న అధ్యాపకులకు ఈ ఏడాదిలో మెరుగైన ఉత్తీర్ణత సాధించడం ఎలాగని మథనపడుతున్నారు. మరోపక్క పుస్తకాలు లేకుండా చదువులు సాగించిన తమపిల్లలకు పబ్లిక్ పరీక్షల్లో ఎలాంటి ఫలితాలు వస్తాయోనన్న ఆందోళన తల్లిదండ్రుల్లో నెలకొంది.

ఉమ్మడిజిల్లాలో

ఉమ్మడి చిత్తూరుజిల్లాలో 62ప్రభుత్వ, 2ఏపీఆర్‌జేసీ, 16కేజీబీవీ, 18 ఏపీమోడల్, 11 సాంఘిక సంక్షేమ, 2ఏపీ ట్రైబల్ వెల్ఫేర్ జూనియర్ కళాశాలలు ఉన్నాయి. వీటిలో దాదాపు 10వేలమందికిపైగా విద్యార్థులున్నట్లు సమాచారం. కాలేజీల ప్రిన్సిపాళ్ల నుంచి అన్ని టైటిల్స్‌కు సంబంధించిన ఇండెంట్ తీసుకున్నారు గానీ పాఠ్యపుస్తకాలు మాత్రం సరఫరా చేయలేదు. పాఠ్యపుస్తకాలను ముద్రించకుండా ప్రైవేట్ మార్కెట్‌లో విద్యార్థులు కొనుక్కోవాలని ఉన్నతాధికారులు మౌఖిక ఆదేశాలు జారీచేశారు. అయితే గతేడాది జిల్లాలో గ్రౌండ్ బ్యాలెన్స్ కింద ఉన్న దాదాపు 10శాతం పుస్తకాలను కొన్ని కళాశాలల ప్రిన్సిపాళ్లు తీసుకెళ్లారని అధికారులు అంటున్నారు.

విద్యార్థులకు సర్దుబాటు చేశాం

గత అయిదేళ్ల విద్యార్థుల వద్దద ఉన్న పుస్తకాలను సేకరించి ఈ ఏడాది పంపిణీ చేశాం. టెక్స్ పుస్తకాల కొరతను తగ్గించాం. ఉత్తీర్ణత శాతం పెంచేందుకు 50 రోజుల జయీభవ కార్యక్రమాన్ని అమలు చేస్తున్నాం. ఉదయం, సాయంత్రం వేళల్లో వివిధ సబ్జెక్టుల్లో వెనుక బడి విద్యార్థులకు ప్రత్యేక శిక్షణ ఇస్తున్నాం. మంచి ఫలితాలు వచ్చేందుకు కృషి చేస్తున్నాం.

-సయ్యద్ మౌలా, డీవీఈవో

చిత్తూరు రైల్వే స్టేషన్‌లో తనిఖీలు


రైల్వే స్టేషన్‌లో డాగ్ స్క్వాడ్‌తో తనిఖీ చేయిస్తున్న డీఎస్పీ

చిత్తూరు రూరల్, ఫిబ్రవరి 9: చిత్తూరు రైల్వే స్టేషన్‌లో శుక్రవారం జీఆర్‌పీ డీఎస్పీ షాను షేక్ ఆధ్వర్యంలో రైల్వే పోలీసులు ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఎన్నికల సమీపిస్తున్న నేపథ్యంలో ఈ తనిఖీలు నిర్వహిస్తున్నామని డీఎస్పీ తెలిపారు. ప్రత్యేకించి అంతర్రాష్ట్ర రైళ్లపై ప్రత్యేక నిఘా ఉంచామన్నారు. ఓటర్లను ఆకట్టుకునేందుకు పంపిణీ చేసే వస్తువుల్లో భాగంగా.. ఫ్యాన్లు, స్టీల్ గిన్నెలు, మిక్సీలు, గొడుగులు ఇలా 24 వస్తువులను భారీగా తీసుకెళ్లేటప్పుడు బిల్లు ఉంచుకోవాలని స్పష్టంచేశారు. మద్యం బాటిళ్లతో దొరికితే జైలుకు పంపిస్తామని ఆమె హెచ్చరించారు. మద్యంతో పాటు, గంజాయిపైనా ప్రత్యేక నిఘా ఉంచామన్నారు. ఇందుకోసం డాగ్ స్క్వాడ్‌లతో తనిఖీలు నిర్వహిస్తున్నామని వివరించారు. ఈ తనిఖీలు ప్రతీరోజూ ఉంటాయన్నారు. బంగారం, వెండితో ప్రయాణించినా వాటికి సంబంధించిన రికార్డులు తమ వద్ద ఉంచుకోవాలని సూచించారు. రికార్డులు లేకుండా దొరికే వస్తువులను సీజ్‌చేసి కేసు నమోదు చేస్తామన్నారు. గత వారం కూడా పెద్ద మొత్తంలో రికార్డుల్లేని మిక్సీలను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. ఈ తనిఖీల్లో సీఐలు దేవేంద్రకుమార్, ఆర్‌పీఎఫ్ సీఐ కోటేశ్వరరావు, ఎస్‌ఐ ప్రవీణ్‌కుమార్ పాల్గొన్నారు.


ఉద్యోగుల వివరాలు సేకరణ పరిశీలిస్తున్న డ్వామా పీడీ రాజశేఖర్

ఉద్యోగుల వివరాల సేకరణ పూర్తి

చిత్తూరు కలెక్టరేట్, ఫిబ్రవరి 9: జిల్లాలో ఉపాధ్యాయులు సహా 71 ప్రభుత్వ శాఖల్లో పనిచేస్తున్న ఉద్యోగులకు సంబంధించి సేకరిస్తున్న ఫొటో ఓటరు గుర్తింపు కార్డు వివరాల ప్రక్రియ శుక్రవారంతో ముగిసింది. ఈ ప్రక్రియను డ్వామా పీడీ రాజశేఖర్ పరిశీలించారు. ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు నిర్దేశిత ప్రొఫార్మాలో సీఎఫ్ఎంఎస్ ద్వారా జీతాలు పొందుతున్న, పొందని ఉద్యోగులందరి వివరాలను సేకరించారు. సార్వత్రిక ఎన్నికల్లో పాల్గొనే ఉద్యోగులకు వారి ఓటున్న, వారు ప్రాంతం పోలింగ్ కేంద్రాల పరిధిలో విధులు కేటాయించకుండా ఈ వివరాలు సేకరిస్తున్నారు. వారం రోజులుగా కలెక్టరేట్‌లోని ఎన్ఐసీ కార్యాలయంలో ఈ ప్రక్రియ కొనసాగింది.

20కేజీల గంజాయి స్వాధీనం

నలుగురు నిందితుల అరెస్ట్

తిరుపతి(నేరవిభాగం), ఫిబ్రవరి 9: తమిళనాడుకు గంజాయి తరలిస్తున్న నలుగురిని తిరుపతి ఈస్ట్ పోలీసులు అరెస్ట్ చేశారు. వారి నుంచి రూ.లక్షల విలువజేసే 20కేజీల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. తిరుపతి డీఎస్పీ సురేంద్రరెడ్డి మీడియాకు వివరాలు వెల్లడించారు. విజయవాడ అర్బన్ కృష్ణలంకకు చెందిన లేట్ కనకరావు భార్య బండారి రూపవతి (65), కృష్ణలంక రణధీర్ నగర్‌కు చెందిన కోటేశ్వరరావు భార్య బండారి కుమారి (45), విజయవాడ అర్బన్ అజిత్‌సింగ్ నగర్‌కు చెందిన నాగరాజు భార్య వీరంకి దుర్గ (52) నరసారావుపేటకు చెందిన ఓ వ్యక్తి నుంచి కేజీ రూ.5వేల చొప్పున గంజాయి కొనుగోలు చేస్తుంటారు. దానిపై మరికొంత లాభం వేసుకుని తిరుపతి సంజయ్‌గాంధీకాలనీలో నివాసముంటున్న చిత్తూరు జిల్లా నగరి మండలం ఓజికుప్పానికి చెందిన హరిప్రసాద్ కుమారుడు సత్తుపాటి లోకేశ్వరరావు (47)కు విక్రయిస్తుంటారు. ఆయన చిన్న చిన్న ప్యాకెట్లుగా విభజించి ఒక్కో ప్యాకెట్ రూ.200 చొప్పున పుత్తూరు, నగరి ప్రాంతాల్లో విక్రయిస్తూ సొమ్ము చేసుకుంటున్నాడు. గురువారం సాయంత్రం డీఆర్ మహల్ రోడ్డులోని రైల్వే హాలిడేహోమ్ సమీపంలో అనుమానాస్పదంగా కనిపించిన ముగ్గురు మహిళలు, ఓ పురుషుడిని అదుపులోకి తీసుకుని తనిఖీ చేయగా 20 కేజీల గంజాయి లభించింది. దాని విలువ రూ.4 లక్షలు ఉంటుందని చెప్పారు. నిందితులపై కేసు నమోదు చేసి, రిమాండ్‌కు పంపనున్నట్లు చెప్పారు. వీరిలో ఎ1 ముద్దాయి లోకేశ్వరరావుపై గతంలో తమిళనాడులో దొంగతనం కేసులు ఉన్నాయని, వాటికి సంబంధించి జైలుశిక్ష కూడా అనుభవించాడని చెప్పారు. మహిళా నిందితుల్లో రూపవతి, వీరంకి దుర్గలపై విజయవాడ, తాడేపల్లి ప్రాంతాల్లో జూదం, గంజాయి అక్రమ రవాణా కేసులు ఉన్నట్లు వివరించారు. పెద్దమొత్తంలో గంజాయిని స్వాధీనం చేసుకున్నందుకుగాను ఈస్ట్ సీఐ మహేశ్వర్‌రెడ్డి, ఎస్‌ఐ పురుషోత్తంరెడ్డి, సిబ్బంది మునిరాజులు, జ్యోతినాథ్, రవికుమార్, చిరంజీవి, మణికంఠలను అభినందించారు.

భగవన్నామస్మరణతో కష్టాలు దూరం: విద్యాధీశ తీర్థ



కార్యక్రమంలో పాల్గొన్న భజన మండళ్ల సభ్యులు - యువ కళాకారులకు ప్రతిభ పురస్కారాలు అందజేస్తున్న విద్యాధీశతీర్థస్వామి

తిరుమల, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): కలియుగంలో యజ్ఞాలు, యాగాలు, తపస్సు చేయకపోయినప్పటికీ హరినామస్మరణ చేస్తే ఎంతటి కష్టమైనా దూరమవుతుందని ఉడిపి పాలిమారు మఠాధిపతి విద్యాధీశతీర్థ అన్నారు. తిరుమల ఆస్థానమండపంలో నిర్వహిస్తున్న పురందరదాసు ఆరాధన మహోత్సవం రెండవ రోజైన శుక్రవారం ఆయన మాట్లాడుతూ పురందరదాసు కీర్తనలు యావత్తు లోకోక్తులేనన్నారు. మానవాళికి పురందరదాసు జీవితసారమే ఆదర్శప్రాయమన్నారు. కేవలం ధనార్జనే ప్రధానంగా భావించిన వ్యక్తి తాను ఎదుర్కొన్న కొన్ని సంఘటనల ద్వారా జ్ఞానసిద్ధిపొంది ప్రఖ్యాత హరిదాసులుగా ఖ్యాతి చెందారన్నారు. దాస పదాల ద్వారా అందరికీ అర్థమయ్యేలా సులువుగా భవవంతుని తత్వాన్ని, శరణాగతి విధానాన్ని, ధర్మాన్ని, నైతిక విలువలను తెలియజేశారని వివరించారు. అనంతరం దాససాహిత్యంలో విశేష కృషి చేసిన 12 మంది యువ కళాకారులకు ప్రతిభ పురస్కారాలను పాలిమారు మఠం ఉత్తరాధికారి విద్యారాజేశ్వరతీర్థతో కలిసి అందజేశారు. అంతకుముందు దాససాహిత్య ప్రాజెక్ట్ ప్రత్యేకాధికారి ఆనందతీర్థాచార్యులు ఆధ్వర్యంలో ఉదయం సుప్రభాతం, ధ్యానం, సామూహిక భజన, నగర సంకీర్తన కార్యక్రమాలు నిర్వహించారు. ఏపీ, తెలంగాణ, తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాల నుంచి 3,500 మంది భజన మండళ్ల సభ్యులు పాల్గొన్నారు.

టాస్క్‌ఫోర్స్ కానిస్టేబుల్ మృతికి నివాళి

గణేష్ స్మారక మందిరం ఏర్పాటు : ఎస్పీ శ్రీనివాస్


గణేష్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఎస్పీ శ్రీనివాస్

తిరుపతి అర్బన్, ఫిబ్రవరి 9: అన్నమయ్య జిల్లా కేవీపల్లి వద్ద ఎర్రచందనం స్మగ్లర్ల కారు ఢీకొని మరణించిన కానిస్టేబుల్ గణేష్(32) మృతికి శుక్రవారం టాస్క్‌ఫోర్స్ అధికారులు, సిబ్బంది కపిలతీర్థం సమీపంలోని కార్యాలయంలో ఘనంగా నివాళులర్పించారు. రైల్వే కోడూరు, కడప సబ్ డివిజన్ల నుంచి సిబ్బంది హాజరై పుష్పాంజలి ఘటించారు. టాస్క్‌ఫోర్సు ఎస్పీ శ్రీనివాస్ మాట్లాడుతూ టాస్క్‌ఫోర్సు కార్యాలయంలో ఒక సమావేశ మందిరానికి గణేష్ స్మారక సమావేశ మందిరంగా నామకరణం చేస్తామని తెలిపారు. సిబ్బంది వ్యక్తిగత రక్షణపై శిక్షణకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. గణేష్ కుటుంబానికి తగిన సహాయ సహకారాలు అందజేస్తామన్నారు. ఆయన మరణానికి కారకులను పట్టుకుని శిక్ష పడేలా చేస్తామని వివరించారు. ఈ కార్యక్రమంలో డీఎస్పీ చెంచుబాబు, ఆర్ఐ(ఏఆర్) సురేష్‌కుమార్ రెడ్డి, సీఐలు శ్రీనివాసులు, సురేష్‌కుమార్, ఆర్ఐలు కృపానంద, చిరంజీవులు, ఏసీఎఫ్ శ్రీనివాస్, ఎఫ్ఆర్వో మురళీకృష్ణ పాల్గొన్నారు.

టీచర్లు లేని ఇంగ్లిష్ మీడియం ఎందుకు?


పోస్టర్లను విడుదల చేస్తున్న దళిత సంక్షేమ సేవా సంఘం సభ్యులు

తిరుపతి(తిలక్‌రోడ్), ఫిబ్రవరి 9: రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఇంగ్లిష్ మీడియం చదువులు ప్రకటనలకే పరిమితమయ్యాయని, కనీసం ఆ సబ్జెక్టు చెప్పడానికి టీచర్లు లేకపోవడమే ఇందుకు నిదర్శనమని దళిత సంక్షేమ సేవా సంఘం రాష్ట్ర అధ్యక్షుడు చంద్రశేఖర్ విమర్శించారు. శుక్రవారం ప్రెస్‌క్లబ్‌లో ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో అమలవుతున్న సంక్షేమ పథకాల డబ్బంతా తిరిగితిరిగి మద్యం దుకాణాలకే వెళుతోందన్నారు. దళితుల భూములను అగ్రవర్ణాల వారు కొనుగోలు చేసి, రెగ్యులరైజ్ చేసుకుని కోట్లు గడిస్తున్నారని పేర్కొన్నారు. దళితుల వద్దనున్న డీకేటీ పట్టాలకు బ్యాంకుల్లో రుణాలు ఇచ్చే ఏర్పాటు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సంఘ నాయకులు ప్రసాద్, జశ్వంత్, బాబు, మునికృష్ణ తదితరులు పాల్గొన్నారు.

సెలెక్ట్ మొబైల్‌షాప్ మేనేజర్‌పై కేసు


బాలకృష్ణ

తిరుపతి(నేరవిభాగం), ఫిబ్రవరి 9: తిరుపతి సెలెక్ట్ మొబైల్‌షాప్ మేనేజర్ బాలకృష్ణపై కేసు నమోదైంది. కంపెనీకి చెందిన రూ.8.88 లక్షల మొత్తాన్ని కాజేసినందుకుగాను అయనపై పోలీసులు కేసునమోదు చేశారు. స్థానిక తిలక్ రోడ్డులోని కృష్ణతులసి ప్యారడైజ్ గ్రౌండ్ ఫ్లోర్‌లో ఉన్న సెలెక్ట్ మొబైల్ షాప్ స్టోర్ మేనేజర్‌గా పి.బాలకృష్ణ పనిచేస్తున్నారు. ఇటీవల ఆడిట్ నిర్వహించగా లక్షల రూపాయల నగదుకు సంబంధించి లెక్క తేలలేదు. మేనేజర్‌ను ప్రశ్నించినా ఆయన సరైన సమాధానం ఇవ్వలేదు. షోరూమ్ సేల్స్ ఎగ్జిక్యూటివ్ అరుణ్‌తో కలిసి మేనేజర్ కంపెనీకి చెందిన రూ.8,88,530 సొంతానికి వాడుకున్నట్లు గుర్తించిన సెలెక్ట్ మొబైల్ షోరూమ్ అధికారి, హైదరాబాద్‌కు చెందిన నాగరాజు ఈ నెల 7వ తేదీన ఈస్ట్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఆ మేరకు బాలకృష్ణ, అరుణ్‌పై కేసు నమోదు చేసిన ఈస్ట్ పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

జన్నత్‌వాలీ మసీదు కూల్చడం దారుణం



నిరసన తెలుపుతున్న ఎస్‌డీపీఐ ప్రతినిధులు

పుంగనూరు, ఫిబ్రవరి9: దేశంలోని జానవాపి, జన్నత్‌వాలీ మసీదులను కూల్చివేయడం దారుణమని ఎస్‌డీపీఐ పట్టణ కార్యదర్శి అతిక్‌బాషా ఖండించారు. శుక్రవారం స్థానిక అంబేడ్కర్ సర్కిల్‌లో వారు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 1947 చట్టాల మేరకు ప్రార్థన మందిరాలు స్వరూపం ఏవిధంగా ఉన్నాయో అదే విధంగా కొనసాగించాలని డిమాండ్ చేశారు. కానీ ఢిల్లీలో 600 సంవత్సరాల క్రితం నిర్మించిన పురాతన జన్నత్‌వాలీ మసీదును కూల్చివేయడం అప్రజాస్వామ్యమన్నారు. దీనిపై పోరాటం చేస్తామన్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు యూసుఫ్, సిద్దిక్, షాముబారక్, చాంద్‌బాషా, మహబూబ్‌బాషా, ఆసిఫ్, నజీర్, ముస్తఫ్, రిజ్వాన్, జావీద్ తదితరులు పాల్గొన్నారు.

ఇళవరసన్‌కు అభినందనలు



పలమనేరు, ఫిబ్రవరి9 : పలమనేరు ప్రభుత్వ డిగ్రీకళాశాల విద్యార్థి ఇళవరసన్‌కు శుక్రవారం ప్రిన్సిపాల్ ఎం.వెంకటేశులు, వైస్‌ప్రిన్సిపాల్ విజయశేఖరం, అధ్యాపక బృందం అభినందనలు తెలిపారు. గణతంత్ర్య దినోత్సవం సందర్భంగా ఢిల్లీలో ఇళవరసన్ ఎన్‌సీసీ నుంచి వెళ్లి ఆర్‌డీసీ పెరేడ్‌లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ ఎం.వెంకటేశులు మాట్లాడుతూ 20 ఏళ్ల తరువాత మన కళాశాల విద్యార్థి ఆర్డీసీ ఫెరేడ్‌కు ఎంపిక కావడం ఆనందదాయకమన్నారు. వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ విజయశేఖరం మాట్లాడుతూ ఇళవరసన్ ఆర్డీసీ ఫెరేడ్‌కు ఎంపిక కావడం కళాశాలకే గర్వకారణమని ప్రశంసించారు. ఎన్‌సీసీ అధికారి పి. బాలాజి మాట్లాడుతూ ఇళవరసన్ దాదాపుగా 10 క్యాంపులలో ఎంతో కష్టపడి ఎంపికవుతూ చివరకు ఆర్డీసీ ఫెరేడ్‌లో పాల్గొన్నాడని తెలిపారు.

వెట్టిచాకిరీ నిర్మూలనపై అవగాహన



మాట్లాడుతున్న న్యాయమూర్తి సింధు

పుంగనూరు రూరల్, ఫిబ్రవరి 9: వెట్టిచాకిరీ నిర్మూలన చట్టంపై న్యాయమూర్తి సింధు అవగాహన కల్పించారు. శుక్రవారం స్థానిక బీడీ కాలనీలోని సచివాలయంలో జరిగిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ బాల కార్మికులను తప్పకుండా చదివించడానికి తల్లిదండ్రులు ప్రోత్సహించాలని అవసరముందన్నారు. ప్రభుత్వపరంగా వారికి అందివ్వాల్సిన సంక్షేమ పథకాలను చేరవేయాల్సివుందన్నారు. సమావేశంలో న్యాయవాది సమీవుల్లా, లేజర్ ఆఫీసర్ మధుబాబు, ఏఎస్ఐ గౌరీశంకర్, సచివాలయసిబ్బంది పాల్గొన్నారు.

మృతుల కుటుంబాలకు టీడీపీ సాయం

రామకుప్పం/శాంతిపురం, ఫిబ్రవరి 9: రామకుప్పం మండలం బండకొత్తూరుకు చెందిన చంపానాయక్, ఆరిమానిపెంటకు చెందిన డేవిడ్, గెర్నిపల్లెకు చెందిన శంకర్ శుక్రవారం అనారోగ్యంతో మృతి చెందారు. టీడీపీ నేతలు నరసింహులు, విశ్వనాథ్, వెంకటాచలం, శ్రీనాథరెడ్డి తదితరులు మృతదేహాలను సందర్శించి నివాళులర్పించారు. మృతుల కుటుంబాలకు పార్టీ తరపున రూ.10 వేలు సాయం అందజేశారు. శాంతిపురం మండలంలోని రెడ్డిపల్లెకు చెందిన మండల టీడీపీ బీసీ సెల్ ప్రధాన కార్యదర్శి గణేష్ భార్య రమాదేవి గురువారం రాత్రి మృతి చెందారు. కుప్పం టీడీపీ ఇన్‌చార్జి పిఎస్ మునిరత్నం, మాజీ ఎమ్మెల్సీ గౌనివారి శ్రీనివాసులు, మండల టీడీపీ అధ్యక్షుడు విశ్వనాథ్‌నాయుడు తదితరులు రమాదేవి మృతదేహానికి నివాళులర్పించారు. అనంతరం గణేష్ కుటుంబ సభ్యులకు పార్టీ అధినేత చంద్రబాబు తరపున రూ.20 వేలు, మండల పార్టీ తరపున రూ.11 వేలు, మండల కురుబ సంఘం తరపున రూ.8 వేలు చొప్పున ఆర్థిక సాయం అందించారు. అలాగే జంగాలపల్లె సీనియర్ కార్యకర్త రత్నప్ప మృతి చెందారు. పార్టీ తరపున ఆయన కుటుంబానికి రూ.10వేలు ఆర్థిక సాయం చేశారు.

వైసీపీ ఆర్థిక సాయం

రామకుప్పం, ఫిబ్రవరి 9: అనారోగ్యంతో శుక్రవారం మృతి చెందిన గెర్నిపల్లెకు చెందిన శంకర్, బండకొత్తూరుతాండాకు చెందిన చంపానాయక్‌ల మృతదేహాలను ఎంపీపీ సుబ్రహ్మణ్యం, మాజీ ఎంపీపీ జయప్ప, స్థానిక సర్పంచులు రాజగోపాల్, మోహన్‌నాయక్, వైసీపీ మండల కో-కన్వీనర్ చంద్రారెడ్డి, ప్రచారకార్యదర్శి కేశవరెడ్డి తదితరులు సందర్శించి నివాళులర్పించారు. మృతుల కుటుంబసభ్యులకు పార్టీ తరపున రూ.10వేలు చొప్పున సాయం అందజేశారు.

ప్రతి విద్యార్థీ ఒక శాస్త్రవేత కావాలి



విద్యార్థులతో ఉపాధ్యాయులు, ప్రిన్సిపాల్ తదితరులు

శాంతిపురం, ఫిబ్రవరి 9 : ప్రతి విద్యార్థీ ఒక శాస్త్రవేతగా తయారు కావాలని రాళ్లబూదు గూరు ఎస్ఐ సుమన్ అన్నారు. శుక్రవారం పరమహంస యోగానంద విద్యాలయంలో పదోతరగతి విద్యార్థుల వీడ్కోల్ సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఎస్ఐ మాట్లా డుతూ తల్లిదండ్రుల ఆశయాలను నెరవేర్చాలన్నారు. అనంతరం విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు. ప్రిన్సిపాల్ ఆజాద్ హుస్సేన్, జాయింట్ కరస్పాండెంట్ రాధాకృష్ణన్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

శ్మశానంలో అక్రమ కట్టడాలను తొలగించండి

వి.కోట, ఫిబ్రవరి9: వి.కోట-కుప్పం ప్రధాన రహదారిలో ముదిమడుగుకు వెళ్ళే దారిలో శ్మశాన స్థలంలో అక్రమంగా నిర్మిస్తున్న కట్టడాలను తొలగించాలని బీజేపీ సీనియర్ నాయకుడు షైందల రామచంద్రుడు, గ్రామస్తులు పంచాయతీ అధికారులకు వినతి పత్రం ఇచ్చారు. ముదిమడుగు శ్మశానం సర్వే నంబరు 297లో 2.15 ఎకరాల భూమి కలదని, అందులో విచ్చలవిడిగా అక్రమంగా నిర్మాణాలు జరుగుతున్నాయని ఆరోపించారు. తక్షణం పంచాయతీ అధికారులు, పాలక వర్గం స్పందించి అక్రమ కట్టడాలను తొలగించి ప్రభుత్వ స్థలాలను పరిరక్షించాలని కోరారు.

సింగిల్ విండోలో
కొత్త ఓటరు కార్డులకు ఫొటోకాపీలు ఇవ్వాలి

శాంతిపురం, ఫిబ్రవరి 9 : వ్యవసాయ సహకార సంస్థలో ఓటు హక్కు కలిగిన రైతులందరూ కొత్త ఓటరు కార్డు పొందేందుకు ఆధార్ కార్డు, రెండు ఫొటోలు, రేషన్ కార్డు, పట్టాదారు పాసుపుస్తకం, వన్‌బీ, అడంగల్ ఫొటో కాపీలు ఈనెల 12లోపు చేర్చాలని చైర్మన్ మునిరత్నం, సీఈవో శివారెడ్డి, మేనేజర్ గణేష్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. సింగిల్ విండోలో ఖాతా ఉండి షేర్ ఉన్న ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు ఉంటుందన్నారు.

ఔత్సాహిక పారిశ్రామిక వేత్తల అభివృద్ధే ధ్యేయం
పంజాబ్ నేషనల్ బ్యాంక్ డీజీఎం అభిజిత్ సిన్హా



మాట్లాడుతున్న బ్యాంక్ డీజీఎం అభిజిత్ సిన్హా

గంగవరం, ఫిబ్రవరి9: ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలకు తక్కువ వడ్డీతో రుణాలందించడమే తమ బ్యాంకు లక్ష్యమని పంజాబ్ నేషనల్ బ్యాంక్ డీజీఎం అభిజిత్ సిన్హా పేర్కొన్నారు. శుక్రవారం గంగవరం మండలం గండ్రాజుపల్లె సమీపంలోని ఆటోనగర్‌లో గల ఇండస్ట్రియల్ ఎస్టేట్‌లో ఔత్సాహిత పారిశ్రామిక వేత్తలతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలకు రుణాలందించడానికి ప్రభుత్వంతో మా బ్యాంకు ఎంఓయూ కుదుర్చుకుందన్నారు. ఈ ఒప్పందం ప్రకారం చిన్న, మధ్యతరహా పరిశ్రమలను ప్రారంభించాలనే వారికి బ్యాంకు రుణాలు అందించడానికి సిద్ధంగా ఉన్నామన్నారు. కార్యక్రమంలో చీఫ్‌మేనేజర్లు శ్రీకాంత్, భూపేస్, పాండ్య, సత్యనారాయణ, యుగంధర్, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

వైఎస్ఆర్ విలేజ్ క్లినిక్ పరిశీలన

చౌడేపల్లె : పరికిదొనలోని వైఎస్ఆర్ విలేజ్ క్లినిక్‌ను కేంద్ర క్వాలిటీ అస్యూరెన్స్ వైద్య బృందం వైద్యులు డాక్టర్ రోనక్ శర్మ, డాక్టర్ పవేన్‌థాస్ శుక్రవారం పరిశీలించారు. గర్భిణులకు, బాలింతలకు అందిస్తున్న వైద్యసేవలను ఆరాతీశారు. డాక్టర్ పవన్‌కుమార్, సర్పంచ్ లక్ష్మిదేవి, ఎంఎల్‌హెచ్‌పీ ధరణి పాల్గొన్నారు.

బోయచిన్నాగనపల్లెలో భారీగా టీడీపీలో చేరికలు

వి.కోట, ఫిబ్రవరి 9: వి.కోట మండలం బోయచిన్నాగనపల్లెలో వైసీపీ నేతలు, కార్యకర్తల కుటుంబాలు మాజీ మంత్రి అమరనాథరెడ్డి సమక్షంలో భారీ ఎత్తున టీడీపీలో చేరారు. శుక్రవారం ఆ గ్రామంలో ఏర్పాటు చేసిన సభలో సుమారు 20 కుటుంబాలు వైసీపీ నుంచి టీడీపీలోకి రాగా మాజీ మంత్రి పసుపు కండువాలు కప్పి వారిని ఆహ్వానించారు. బోయచిన్నాగనపల్లె నుంచి వీఎస్ఎస్ చైర్మన్ హనుమంతగౌడు, శ్రీనివాసులు, మణి, సురేష్, మోహన్‌రెడ్డి, సుబ్రమణ్యం, నాగరాజు, కృష్ణమూర్తి, నారాయణప్ప, వెంకటలక్ష్మమ్మ, శివప్పగౌడు, అభి, సతీష్, ఎం.నారాయణస్వామి, వసంతమ్మ, మేనక, మమతలు, రామనాథపురం నుంచి కే.పళణి, సలాం, లింగాపురం నుంచి ఎస్.పళణి తదితరులు వైసీపీ నుంచి వచ్చారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు రంగనాథ్, ప్రధాన కార్యదర్శి ఈశ్వర్, ఏఎంసీ మాజీ చైర్మన్ రామచంద్రనాయుడు, జిల్లా అధికార ప్రతినిధి రాంబాబు, పంచాయతీ పార్టీ అధ్యక్షుడు చంద్రబాబు, ఇతర నేతలు ఆంజినేయరెడ్డి, మునస్వామి, గజేంద్ర, భక్తా, రామూర్తి, సోమశేఖర్, మణి, ధీరజ్, నారాయణస్వామి, పరంధామ తదితరులు ఉన్నారు.



బోయచిన్నాగనపల్లెలో టీడీపీలో చేరిన వైసీపీ నేతలు

సార్వత్రిక ఎన్నికలకు సన్నద్ధం కావాలి : గౌనివారి



కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతున్న గౌనివారి శ్రీనివాసులు

శాంతిపురం, ఫిబ్రవరి 9: గ్రామాల్లో కార్యకర్తలు, నాయకులు సమన్వయంతో సార్వత్రిక ఎన్నికలకు సన్నద్ధం కావాలని మాజీ ఎమ్మెల్సీ గౌనివారి శ్రీనివాసులు, మండల టీడీపీ అధ్యక్షుడు భాష్యం విశ్వనాథ్‌నాయుడు, మాజీ ఎంపీపీ ఉదయకుమార్, మండల టీడీపీ మాజీ అధ్యక్షుడు విజయరామిరెడ్డి అన్నారు. శుక్రవారం మండలంలోని మొరసనపల్లె, నడింపల్లె, తుమ్మిశి, చిన్నారిదొడ్డి గ్రామ పంచాయతీలలో టీడీపీ కార్యకర్తల సమావేశం జరిగింది. వారు మాట్లాడుతూ వైసీపీ మళ్లీ అధికారంలోకి వస్తే రాష్ట్రం అంధకారంలోకి వెళ్లిపోవడం ఖాయమన్నారు. బిడ్డల భవిష్యత్తు బాగుండాలంటే టీడీపీని గెలిపించుకోవాలన్నారు. టీడీపీ నేతలు చంద్రశేఖర్, నారాయణస్వామి, నాగరాజు, ఇ.నారా యణరెడ్డి, ఆర్ఎస్ మణి, ఉయ్యాల జయరామిరెడ్డి, నాగరాజు, రామచంద్ర నాయుడు, గోవిందరాజులు, తుమ్మిశి శేఖర్, మురళి, గిరిధర్, పెంకులు సుబ్బన్న, బాలకృష్ణ, గోవిందరాజులు, చలపతి, శ్రీనివాసులురెడ్డి, జయరాం, సుగుణమ్మ పాల్గొన్నారు.

గ్రామాల్లో లోపించిన పారిశుధ్యం



కపాడమిట్టపల్లె, గోపిశెట్టిపల్లెల్లో రోడ్లపై పారుతున్న మురుగు నీరు

పుంగనూరు రూరల్, ఫిబ్రవరి 9: గ్రామాల్లో పారిశుధ్యం లోపించి అంటురోగాలు ప్రబలుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదని విమర్శలు వస్తున్నాయి. మండలంలోని కుమ్మరనత్తం పంచాయతీ కపాడమిట్టపల్లె, కుమ్మరగుంట, గోపిశెట్టిపల్లె, మద్దనపల్లె గ్రామాల్లో పారిశుధ్యం లోపించి దోమలు పెరిగి అంటువ్యాధులు ప్రబలుతున్నాయని ప్రజలు వాపోతున్నారు. గ్రామాల్లో సీసీ రోడ్లు వేసి కాల్వలు నిర్మించకపోవడంతో మురుగునీళ్లు వీధుల్లో ప్రవహిస్తున్నాయి. అలాగే ఇళ్లలో నుంచి వచ్చే వ్యర్థపునీరు కూడా వీధుల్లో ప్రవహించడం వల్ల నడవటానికి ఇబ్బందిగా ఉన్నట్లు ప్రజలు ఆవేదన వ్యక్తం చేశారు. కుమ్మరగుంటలో మురుగు కాల్వల్లోనే తాగునీటి కొళాయిలు ఉండటం వల్ల నీరు కలుషితం అవడానికి అవకాశాలు ఉన్నాయన్నారు. గోపిశెట్టిపల్లెలో వీధుల్లో మురుగునీరు ప్రవహిస్తోంది. అధికారులు గ్రామాల్లో పారిశుధ్యం పనులు చేపట్టి అంటురోగాల నుంచి కాపాడాలని ప్రజలు కోరుతున్నారు.

నేటి నుంచి 'పల్లెకు పోదాం'
బీజేపీ జిల్లా అధ్యక్షుడు జగదీశ్వరనాయుడు



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న బీజేపీ నేతలు

కుప్పం, ఫిబ్రవరి 9: భారతీయ జనతాపార్టీ ఆధ్వర్యంలో శనివారం నుంచి పల్లెకు పోదాం పేరుతో గ్రామాలకు వెళ్లే కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు జగదీశ్వర్‌నాయుడు, ప్రధాన కార్యదర్శి ఎన్ఎస్.తులసీనాథ్ తెలిపారు. కుప్పంలోని బీజేపీ కార్యాలయంలో శుక్రవారం పల్లెకు పోదాం కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు విలేకరులతో మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పలు అభివృద్ధి, సంక్షేమ పథకాల గురించి ప్రజల్లో అవగాహన కల్పిస్తారని చెప్పారు. తిరిగి బీజేపీని గెలిపించి, దేశ ప్రధానిగా మోదీకి అవకాశం ఇవ్వాలని పిలుపునిచ్చారు. సమావేశంలో బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి అట్లూరి శ్రీనివాస్, యువమోర్చా జిల్లా అధ్యక్షుడు దామోదర్, ఓబీసీ మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి గజేంద్ర, గుడుపల్లె మండల బీజేపీ అధ్యక్షుడు రామచంద్రుడు తదితరులు పాల్గొన్నారు.

కేంద్రంలో తిరిగి అధికారం బీజేపీదే..

వి.కోట : రానున్న 2024 ఎన్నికల్లో కేంద్రంలో బీజేపీ అత్యధిక స్థానాలను కైవశం చేసుకుని మూడోసారి అధికారంలోకి వస్తుందని చిత్తూరు బీజేపీ అధ్యక్షుడు జగదీశ్వర్ అన్నారు. శుక్రవారం వి.కోటలో జరిగిన మండల స్థాయి సమావేశంలో పల్లెకు పోదాం కార్యక్రమ వివరాలతో కూడిన పోస్టరును ఆయన విడుదల చేశారు. కార్యక్రమంలో పలమనేరు అసెంబ్లీ కన్వీనర్ విజయ్‌కుమార్, మండల అధ్యక్షుడు సోమశేఖర్, జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్, బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు దామోదర్‌రెడ్డి, మండల కార్యదర్శి హేమంత్, నేతలు కృష్ణ, రవి, హనుమంతరెడ్డి తదితరులు ఉన్నారు.

డ్వాక్రా మహిళలకు ఆసరా చెక్కుల పంపిణీ

పుంగనూరు/సోమల/కల్లూరు/చౌడేపల్లె/రొంపిచెర్ల, ఫిబ్రవరి 9 : స్థానిక బీఎంఎస్ క్లబ్, వ్యవసాయమార్కెట్ యార్డులో మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి శుక్రవారం మహిళలకు ఆసరా చెక్కులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ఏడాది పుంగనూరులో పెట్టిన మహిళా మార్ట్ ద్వారా పదిలక్షలు ఆదాయం వచ్చినట్లు తెలిపారు. సమావేశంలో కలెక్టర్ షన్మోహన్, పలమనేరు ఆర్డీవో మనోహర్‌రెడ్డి, జడ్పీ చైర్మన్ శ్రీనివాసులు, జడ్పీ సీఈవో ప్రభాకర్‌రెడ్డి, మున్సిపల్ చైర్మన్ అలీంబాషా, ఎంపీపీ భాస్కర్‌రెడ్డి, జానపద కళలసంస్థ రాష్ట్ర చైర్మన్ నాగభూషణం, ముడా చైర్మన్ వెంకటరెడ్డియాదవ్ పాల్గొన్నారు. పులిచెర్ల ఎంపీడీఓ కార్యాలయంలో 963 సంఘాల్లోని 8445మంది సభ్యులకు రూ:11.76తో కూడిన మెగా చెక్కును పంపిణీ చేశారు. అలాగే సీఎం సహాయ నిధి కింద పలువురికి చెక్కులను మంత్రి పంపిణీ చేశారు. సోమల స్థానిక హైస్కూల్ ఆవరణలో 908 స్వయం సహాయక సంఘాలకు రూ.7,00,17,359 చెక్కును మంత్రి పెద్దిరెడ్డి పంపిణీ చేశారు. చౌడేపల్లెలో డ్వాక్రా మహిళలకు మంత్రి పెద్దిరెడ్డి ఆసరా చెక్కులను, సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు పంపిణీ చేశారు. రొంపిచెర్ల మండలంలోని ఐదు మందికి ముఖ్యమంత్రి సహాయనిధి కింద ఆర్థిక సాయం అందించారు.



మహిళలకు చెక్కులు అందజేస్తున్న మంత్రి పెద్దిరెడ్డి

వాహనాల వినియోగంపై విద్యార్థులకు అవగాహన

పుంగనూరు రూరల్, ఫిబ్రవరి9:! విద్యార్థులకు ద్విచక్రవాహనాల మరమ్మతులు, వినియోగంపై అవగాహన కల్పించినట్లు మోడల్ పాఠశాల ప్రిన్సిపాల్ డాక్టర్ రమా తెలిపారు. శుక్రవారం పట్టణంలోని ద్విచక్రవాహనాల షోరూం వద్దకు విద్యార్థులను తీసుకువచ్చి వాహనాల వినియోగంపై పలు సూచనలు, సలహాలు అందించినట్లు ఆమె తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు కళ్యాణ్, వనిజ, అనిల్, పీఈటీ శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

పీవీకి భారత రత్న పట్ల హర్షం

పలమనేరు, ఫిబ్రవరి9 : తెలుగువాడైన దివంగత మాజీ ప్రధాని పీవీ నరసింహారావుకు భారతరత్న ప్రకటించడం పట్ల తెలుగు సాహిత్య సాంస్కృతిక సమితి అధ్యక్షుడు పి. తులసినాథంనాయుడు హర్షం వ్యక్తం చేశారు. రచయితగా, కవిగా, బహుభాషాకోవిదులుగా, రాజనీతిజ్ఞులుగా, ఆర్థికశాస్త్రవేత్తగా, సంస్కరణాభిలాషిగా కీర్తి గడించిన పీవీ నరసింహారావు నిజమైన భారతరత్న అని తులసినాథంనాయుడు పేర్కొన్నారు.

విద్యుత్ సరఫరా 2 గంటలు తగ్గించడం తగదు

పెద్దపంజాణి, ఫిబ్రవరి 9: పగటిపూటే రైతులకు 9గంటలు విద్యుత్ అందిస్తామని చెప్పిన ఈ ప్రభుత్వం మాట తప్పి 7గంటలకు తగ్గించడం హేయమైన చర్యగా జిల్లా టీడీపీ నాయకుడు శ్రీరాములు ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ముందస్తు సమాచారం లేకుండా శుక్రవారం నుంచి విద్యుత్ వేళల్లో మార్పు చేయడంతోపాటు సరఫరాలో 2గంటలు తగ్గించామని విద్యుత్ అధికారులు పేర్కొనడంతో రైతులు అవాక్కవుతున్నారని తెలిపారు. ప్రస్తుతం వరి, టమోటా, బీన్స్, మల్బరి, వంకాయ, ముల్లంగి, బీట్‌రూట్ మొదలగు పంటలు సాగులో ఉన్నాయని, ఇలాంటి పరిస్థితిలో విద్యుత్ సరఫరా కుదించడంతో ఎలా కాపాడుకోవాలో రైతులకు అర్థంకాక దిక్కుతోచని పరిసితిలో పడ్డారన్నారు. రైతులను పూర్తిగా నష్టపరిచే ఈ నిర్ణయం ప్రభుత్వం వెంటనే వెనక్కి తీసుకోవాలన్నారు.

గాండ్ల కులస్తులకు 2 ఎకరాల స్థలం కేటాయింపు

కుప్పం, ఫిబ్రవరి 9: కుప్పం నియోజకవర్గ గాండ్ల కులస్తులకు రెండు ఎకరాల స్థలం కేటాయిస్తూ ప్రభుత్వం శుక్రవారం జీవో జారీ చేసింది. స్థలం కేటాయింపుపై నియోజకవర్గ గాండ్ల కులస్తులు హర్షం వ్యక్తం చేశారు ఇందుకోసం ప్రత్యేకంగా కృషి చేసిన రెస్కో చైర్మన్ సెంథిల్ కుమార్‌కు వారు ధన్యవాదాలు తెలిపారు. మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి ద్వారా సీఎం జగన్‌కు సెంథిల్ విన్నవించడం వల్లే ఇది సాధ్యమైందని వారు పేర్కొన్నారు. ఆ స్థలంలో కళ్యాణ మండపం నిర్మాణం కోసం త్వరలో నిధులు మంజూరు చేయించి పనులు ప్రారంభిస్తామన్నారు.

14న కాణిపాకంలో సామూహిక అక్షరాభ్యాసం

ఐరాల(కాణిపాకం), ఫిబ్రవరి 9: ప్రముఖ పుణ్యక్షేత్రమైన కాణిపాకంలో వసంత పంచమిని పురస్కరించుకుని ఈ నెల 14 సామూహిక అక్షరాభ్యాసాన్ని నిర్వహించనున్నట్లు చైర్మన్ మోహన్‌రెడ్డి, ఈవో వెంకటేశు తెలిపారు. ఆలయ ఆస్థాన మండపంలో ఈ కార్యక్రమం నిర్వహిస్తామని చిన్నపిల్లల తల్లిదండ్రులు ప్రతి ఒక్కరూ పాల్గొనాలని వారు కోరారు.

తిరుపతి అసెంబ్లీ నియోజకవర్గం
టీడీపీ పరిశీలకుడిగా భీమనేని



పాలసముద్రం/వెదురుకుప్పం, ఫిబ్రవరి 9: టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శిగా ఉన్న భీమనేని చిట్టిబాబు నాయుడును ఎన్నికల నిమిత్తం తిరుపతి అసెంబ్లీ నియో జక వర్గ పరిశీలకుడిగా ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు అచ్చెన్నాయుడు నియమించారు. శుక్రవారం పాలసముద్రంలో విలేకరులతో భీమనేని మాట్లాడారు.పార్టీ విజయం కోసం శక్తివంచనలేకుండా కృషిచేస్తానని తెలియ జేశారు.

లోక్ అదాలత్‌ను విజయవంతం చేయండి

పలమనేరు, ఫిబ్రవరి9 : మార్చినెలలో జరిగే జాతీయ లోక్ అదాలత్‌ను విజయవంతం చేయాలని శుక్రవారం పలమనేరు సీనియర్ సివిల్ జడ్జి పి.శ్రీనివాసరావు పిలుపు నిచ్చారు. శుక్రవారం పోలీసులతో ఆయన సమావేశం నిర్వహించారు. కక్షిదారులకు లోక్ అదాలత్‌లో కేసులు పరిష్కరించుకోవడం వలన కలిగే ప్రయోజనాలను పోలీసులు వివరించాలని సూచించారు. కోర్టులో పెండింగ్‌లో ఉన్న క్రిమినల్ కేసులను రాజీ మార్గంలో పరిష్కరించుకొనేందుకు కృషి చేయాలని కోరారు.

నాడు-నేడు పనుల పరిశీలన

సోమల, ఫిబ్రవరి 9: ప్రభుత్వ బడుల్లో నాడు-నేడు పనులను నాణ్యదగా పూర్తి చేయాలని ఎంఈవో శివరత్న అన్నారు. శుక్రవారం వడ్డిపల్లె పాఠశాలలో మరుగుదొడ్ల నిర్మాణాల పనులను పరిశీలించారు. అలాగే పాఠశాలల్లో తాగునీటి సౌకర్యాలను పరిశీలించి తగు చర్యలు చేపట్టాలన్నారు. మధ్యాహ్న భోజన పథకం అమలపై వంట నిర్వాహకులతో సమీక్షించారు. హెచ్ఎం సుబ్రహ్మణ్యం, శివరాం, జీసీకే ప్రసాద్ పాల్గొన్నారు.

శాస్త్రోక్తంగా రాహుకాల పూజలు



చౌడేపల్లె, ఫిబ్రవరి9: బోయకొండ గంగమ్మ ఆలయంలో శుక్రవారం శాస్త్రోక్తంగా రాహుకాల పూజలు నిర్వహించారు వేద పండితులు రాహుకాలంలో అమ్మవారికి పంచామృతాభిషేకాలు నిర్వహించి, ప్రత్యేకంగా అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. అధిక సంఖ్యలో భక్తులు రాహుకాల అభిషేక పూజలో పాల్గొని తీర్థప్రసాదాలు అందుకున్నారు. ఆలయ చైర్మన్ నాగరాజరెడ్డి, ఈవో చంద్రమౌళి భక్తులకు అన్నదానం నిర్వహించారు. అన్నదానం కోసం పలమనేరు సీఎ.ఆర్ టమోటా మండీ నాగిరెడ్డి, ఆతడి సహచరులు కూరగాయలను విరాళంగా ఇచ్చారు. అలాగే పుంగనూరు ఎంపీపీ భాస్కర్‌రెడ్డి రూ.5116 విరాళంగా ఇచ్చారు.

ప్రత్యేక అలంకరణలో విరూపాక్షి మారెమ్మ



పుంగనూరు రూరల్, ఫిబ్రవరి9: పట్టణ నడిబొడ్డున వెలసిన విరూపాక్షి మారెమ్మ శుక్రవారం ప్రత్యేక అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. ఉదయాన్నే అర్చకులు మురళి, శ్రీనివాసులు ఆలయాన్ని శుద్ధి చేసి వేప, మామిడి ఆకులతో తోరణాలు కట్టి ప్రత్యేకంగా అలంకరించి ప్రత్యేక పూజలు, అభిషేకాలు. అర్చనలు చేసి భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. మహిళలు ఉపవాసాలతో అమ్మవారికి చీరలు, రవికలు మొక్కులుగా చెల్లించి మొక్కులు తీర్చుకుని తీర్థప్రసాదాలు అందుకున్నారు.

నీటి శుద్ధి యంత్రం వితరణ



రొంపిచెర్ల, ఫిబ్రవరి9 :బొమ్మయ్యగారిపల్లె ప్రాథమిక పాఠశాలకు శుక్రవారం విర్బాక్ అనిమల్ హెల్త్ ఇండియా ప్రైవేట్ లిమిటెట్ చిత్తూరు ఏరియా మేనేజర్ ఎం.తిరుపతిరెడ్డి నీటి శుద్ధి యంత్రాన్ని వితరణగా ఇచ్చి ప్రారంభించారు. కార్యక్రమంలో హెచ్ఎం రమేష్, పశు వైద్యాధికారి శ్రీధర్ కంపెనీ ప్రతినిధులు దిలీప్, సిరాజుద్దీన్, ఉపాధ్యాయులు హాఫీజుల్లా, రెడ్డెప్ప నాయుడు, నారాయణ, ప్రకాష్ పాల్గొన్నారు.

వైష్ణవి దేవికి ప్రత్యేక పూజలు

చౌడేపల్లె, ఫిబ్రవరి 9: మండలంలోని పుదిపట్లలో వెలసిన వైష్ణవిదేవికి శుక్రవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయాన్నే ఆలయ నిర్వహకులు అమ్మవారికి పంచామృతాభిషేకాలు నిర్వహించి, ప్రత్యేకంగా అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. ఆలయ నిర్వహకులు వినోద్‌కుమార్‌రెడ్డి, శ్రావణి అన్నదానం చేశారు.

చెరువు కట్ట నిర్మాణం పరిశీలన

కుప్పం, ఫిబ్రవరి 9: కుప్పం చెరువుకట్ట చుట్టూ నిర్మాణమవుతున్న ప్రహరీని శుక్రవారం మున్సిపల్ చైర్మన్ డాక్టర్ సుధీర్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇప్పటికే 80 శాతం ప్రహరీ నిర్మాణం పూర్తయిందన్నారు. మిగిలిన 20 శాతం పనులు కూడా త్వరగా పూర్తిచేస్తే పట్టణ వాసులకు అనువుగా చెరువు చుట్టూ ఇంటర్ లాకింగ్ టైల్స్ ఫుట్‌పాత్‌ను వెడల్పు చేస్తామని చెప్పారు. పలువురు కౌన్సిలర్లు పాల్గొన్నారు.

ప్రయాణికులకు బహుమతులు

పలమనేరు, ఫిబ్రవరి9 : పలమనేరు డిపో ఆవరణలో శుక్రవారం ఎంపికైన ప్రయాణికులకు డిపో మేనేజర్ స్వామి బహుమతులు అందజేశారు. పలమనేరు-చౌడేపల్లి రహదారిలో ఆర్టీసీలో ఆక్యుపెన్సీ పెంచేందుకు ఈనెల 5వ తేది బస్సులో ఏర్పాటుచేసిన గిఫ్టుబాక్సులో వేయబడిన టికెట్లు సేకరించి లక్కీడిప్‌ను 6వ తేది నిర్వహించారు. ఇందులో ఆర్.సుహాసిని, ఆర్. శంకరరెడ్డి, ఎస్. జమెరుద్దీన్ ఎంపికయ్యారు. వీరికి శుక్రవారం డిపో మేనేజర్ బహుమతులు అందజేశారు.

పారిశుధ్య పనుల పరిశీలన

పలమనేరు, ఫిబ్రవరి9 : పలమనేరు మున్సిపల్ కమిషనర్ రమణారెడ్డి గురువారం కంపోస్టు యార్డును సందర్శించారు. పట్టణంలో సేకరించిన చెత్తను సేంద్రియ ఎరువుగా తయారు చేస్తున్న వివరాలను సిబ్బందిచే అడిగి తెలుసుకొన్నారు. శుక్రవారం ఉదయాన్నే వారపు సంత జరిగే ప్రాంతాన్ని పరిశీలించి వారానికి తప్పని సరిగా రెండు పర్యాయాలు సంత ప్రాంతాన్ని శుభ్రపరచాలని సిబ్బందిని ఆదేశించారు. అనంతరం గంగమ్మ గుడి వీధిలో కూడా పారిశుధ్య పనులను పరిశీలించారు. మురుగునీటి కాలువ నుంచి తీసిన వ్యర్థాలను ఎప్పటికప్పుడు తొలగించాలని సూచించారు. కార్యక్రమంలో మున్సిపల్ సిబ్బంది, శానిటరీ సెక్రటరీ పాల్గొన్నారు.

ఈవీఎంలపై అవగాహన

పలమనేరు, ఫిబ్రవరి9: పలమనేరు మున్సిపాలిటీలోని 252, 253, 255, 256, 257, పోలింగ్ కేంద్రాల పరిధిలోని ఓటర్లకు శుక్రవారం ఈవీఎంలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈవీఎంలలో ఓటు ఏ విధంగా వినయోగించుకోవాలో అధికారులు ఓటర్లకు, రాజకీయ నాయకులకు వివరించారు. ఈ కార్యక్రమంలో సెక్టోరల్ అధికారి, మున్సిపల్ మేనేజర్ ఖాదర్‌మొహిద్దీన్‌తో పాటు బూత్ లెవెల్ అధికారులు, పోలీసు సిబ్బంది, స్థానిక ప్రజాప్రతినిధులు, రాజకీయ నాయకులు పాల్గొన్నారు.

చేయూత చెక్కు పంపిణీ



చిత్తూరు, ఫిబ్రవరి 9: వైఎస్సార్ చేయూత నాలుగో విడత చెక్కు పంపిణీ కార్యక్రమం శుక్రవారం నాగయ్య కళాక్షేత్రంలో జరిగింది. కమిషనర్ అరుణ మాట్లాడుతూ నగరపాలక సంస్థ పరిధిలో 2071 స్వయం సహాయక సంఘాలకు సంబంధించి రూ.18.86 కోట్ల వైఎస్సార్ ఆసరా నిధులు మంజూరైనట్లు తెలిపారు. ఆర్టీసీ వైస్ చైర్మన్ విజయానందరెడ్డి, నగర మేయర్ అముద, మెప్మా మిషన్ డైరెక్టర్ విజయలక్ష్మి, డిప్యూటీ మేయర్లు చంద్రశేఖర్, రాజేష్‌కుమార్‌రెడ్డి, మెప్మా పీడీ రాధమ్మ పాల్గొన్నారు.

150 రోజులకు చేరిన డెయిరీ కార్మికుల దీక్ష



చిత్తూరు (సెంట్రల్), ఫిబ్రవరి 9: వేతన బకాయిలు చెల్లించాలని కోరుతూ విజయా డెయిరీ కార్మికులు స్థానిక కలెక్టరేట్ వద్ద చేపట్టిన దీక్ష శుక్రవారానికి 150వ రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా కార్మికుడు పీడీ కుమార్ మాట్లాడుతూ అసెంబ్లీ సమావేశాల్లో అమూల్‌కు రూ.385 కోట్లు కేటాయించి తమకు రావాల్సిన రూ.60 కోట్లు బకాయిలు ప్రస్తావించకపోవడం బాధాకరమన్నారు. అమూల్‌కు కేటాయించిన బడ్జెట్‌లో తమకు రూ.60కోట్లు కేటాయించి ఆదుకోవాలని కోరారు. ఈ దీక్షలో ఎబినేజర్, బాషా, వెంకటాచలం, చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

కేంద్ర ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోండి



వెదురుకుప్పం, ఫిబ్రవరి 9: కేంద్ర ప్రభుత్వ పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఎస్సీ మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి పాముల శేషాద్రికుమార్ కోరారు. శుక్ర వారం ఆళ్లమడుగు గ్రామ పంచాయతీ నాగార్జునపురంలో 'పల్లెకుపోదాం' కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇందులో భాగంగా బీజేపీ అమలు చేస్తున్న సంక్షేమ పథకాల క్యాలెండర్లు ఆవిష్కరిం చారు. ఇంటింటికీ కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ కార్య క్రమంలో పార్టీ వెదురుకుప్పం మండలాధ్యక్షుడు విశ్వనాథరెడ్డి, నాయకులు హాజరయ్యారు.

టీడీపీ-జనసేన అభ్యర్థిని గెలిపించండి



కరపత్రాలు పంపిణీ చేస్తున్న మల్లికార్జున్‌యాదవ్

వెదురుకుప్పం, ఫిబ్రవరి 9: వెదురుకుప్పం మండలం కొమర గుంట పంచా యతీ సామిరెడ్డి కండ్రిగ గ్రామంలో శుక్ర వారం 'బాబు ష్యూరిటీ -భవిష్యత్తుకు గ్యారెంటీ' కార్య క్రమం నిర్వహించారు. పార్టీ బూత్ కన్వీనర్ బి.మల్లికార్జున్‌యాదవ్ మ్యానిఫెస్టో కరత్రాలు ఇంటింటా పంపిణీ చేశారు. రాబోయే ఎన్నికల్లో టీడీపీ- జనసేన సంయుక్త అభ్యర్థికి ఓటేసి గెలిపించాలని కోరారు. నాయకులు మునిరత్నంరెడ్డి పాల్గొన్నారు.

డీసీసీ బ్యాంకు ఏటీఎం ప్రారంభం

పాలసముద్రం, ఫిబ్రవరి 9: పాలసముద్రంలో డీసీసీ బ్యాంకు ఏర్పాటు చేసిన ఏటీఎం కేంద్రాన్ని, బీసీ కాలనీలో మినరల్ వాటర్ ప్లాంట్‌ను శుక్రవారం డిప్యూటీ సీఎం నారాయణ స్వామి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో జడ్పీటీసీ అన్బు, మండల వైసీపీ కన్వీనర్ తులసీ యాదవ్, సెంట్రల్ బ్యాంకు డీజీఎం లిల్లీ కేథరిన్, ఏజీఎం వెంకటాచలపతి, మేనేజర్ మహేష్ పాల్గొన్నారు.

తహసీల్దార్‌కు సన్మానం



శ్రీరంగరాజపురం, ఫిబ్రవరి 9: ఎస్ఆర్ పురం తహసీ ల్దార్‌గా బాధ్యతలు స్వీకరించిన అల్ ఫెడ్‌ను శుక్రవారం సమాచార హక్కు చట్టం సభ్యులు శాలువా కప్పి సన్మానించారు. ఈ కార్యక్రమంలో మండల ఇన్‌చార్జి సెల్వరాజ్, జాతీయ అధ్యక్షుడు బండి పట్టాభిరెడ్డి, జాతీయ బోర్డు డైరెక్టర్ ఎస్‌హెచ్ రాంప్రకాష్, రాయలసీమ జోన్ మహిళ అధ్యక్షు రాలు నీలవతి, గీత, యేసు, గోవిందరాజులు, గిరిబాబు, స్టీఫెన్, ఆనందబాబు, పుష్పరాజ్, హరినాథ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మర్యాదపూర్వకం



జనసేన పార్టీ రాజకీయ వ్యవహారాల కమిటీ చైర్మన్ నాదెండ్ల మనోహర్‌ను శుక్రవారం తెనాలిలోని ఆ పార్టీ కార్యాలయంలో జీడీ నెల్లూరు నియోజకవర్గ ఇన్‌చార్జి డాక్టర్ యుగంధర్ పొన్న కలిశారు. ఆయన వెంట నియోజకవర్గ యువజన కార్యదర్శి అన్నామలై ఉన్నారు.
- వెదురుకుప్పం

14న కాణిపాకంలో సామూహిక అక్షరాభ్యాసం

ఐరాల(కాణిపాకం), ఫిబ్రవరి 9: ప్రముఖ పుణ్యక్షేత్రమైన కాణిపాకంలో వసంత పంచమిని పురస్కరించుకుని ఈ నెల 14 సామూహిక అక్షరాభ్యాసాన్ని నిర్వహించనున్నట్లు చైర్మన్ మోహన్‌రెడ్డి, ఈవో వెంకటేశు తెలిపారు. ఆలయ ఆస్థాన మండపంలో ఈ కార్యక్రమం నిర్వహిస్తామని చిన్నపిల్లల తల్లిదండ్రులు ప్రతి ఒక్కరూ పాల్గొనాలని వారు కోరారు.

కలెక్టర్‌ను కలిసిన ఎస్పీ



చిత్తూరు, కలెక్టరేట్, ఫిబ్రవరి 9: ఎస్పీగా ఇటీవల బాధ్యతలు స్వీకరించిన జాషువా శుక్రవారం కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో కలెక్టర్ షన్మోహన్‌కు పుష్పగుచ్ఛం అందించి మర్యాద పూర్వకంగా కలిశారు. త్వరలో జరిగే ఎన్నికల్లో పాటించాల్సిన నియమ, నిబంధనలపై చర్చించారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

చిత్తూరు రూరల్, ఫిబ్రవరి 9: విద్యుత్ లైన్ల మరమ్మతుల కారణంగా శనివారం నగరంలో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడనుందని ఈఈ పద్మనాభపిళ్లై తెలిపారు. ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు సరఫరా ఉండదని పేర్కొన్నారు. వినియోగదారులు గమనించాలని కోరారు.

తిరుపతి అసెంబ్లీ నియోజకవర్గం టీడీపీ పరిశీలకుడిగా భీమనేని



భీమనేని చిట్టిబాబు

పాలసముద్రం/ వెదురుకుప్పం, ఫిబ్రవరి 9: టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శిగా ఉన్న భీమనేని చిట్టిబాబు నాయుడును ఎన్నికల నిమిత్తం తిరుపతి అసెంబ్లీ నియోజక వర్గ పరిశీలకులుగా ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు అచ్చెన్నాయుడు నియమించారు. ఈ సందర్భంగా శుక్రవారం పాల సముద్రంలో విలేకరులతో భీమనేని మాట్లాడారు. పార్టీ అధినేత చంద్రబాబుకు, ప్రధాన కార్యదర్శి లోకేశ్‌కు, ఏపీ అధ్యక్షుడు అచ్చెన్నాయుడుకు కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ విజయం కోసం శక్తివంచనలేకుండా కృషిచేస్తానని తెలియ జేశారు.

పూతలపట్టు సీఐగా సుదర్శన్ ప్రసాద్

పూతలపట్టు, ఫిబ్రవరి 9: పూతలపట్టు సీఐగా సుదర్శన్ ప్రసాద్ శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. ఇక్కడి ఎస్‌ఐ రామ్‌భూపాల్ పదోన్నతిపై బదిలీ కావడంతో ఆయన స్థానంలో సుదర్శన్ ప్రసాద్ సీఐగా బాధ్యతలు చేపట్టారు.

సొసైటీకి అండగా ఉంటా

చిత్తూరు రూరల్, ఫిబ్రవరి 9: చిత్తూరు అభివృద్ధికి కృషిచేస్తున్న చిత్తూరు స్మార్ట్ సిటీ డెవలప్మెంట్ సొసైటీకి తన సహాయ సహకారాలు ఎప్పుడూ అందించి అండగా ఉంటానని సీనియర్ సివిల్ జడ్జి కరుణకుమార్ తెలిపారు. శుక్రవారం స్థానిక ఓ ప్రైవేటు హోటల్‌లో సొసైటీ సమావేశం నిర్వహించారు. చిత్తూరు అభివృద్ధి కోసం శ్రమిస్తున్న సొసైటీ సభ్యు లను ఆయన అభినందించారు.

సీఎంకండ్రిగలో 'పల్లెకు పోదాం'



మాట్లాడుతున్న మాజీ ఎంపీ దుర్గారామక్రిష్ణ

గుడిపాల, ఫిబ్రవరి 9: మండలంలోని ఏఎల్‌పురం పంచాయతీ సీఎం కండ్రిగలో మండల బీజేపీ అధ్యక్షుడు ధనం జయనాయుడు ఆధ్వర్యంలో 'పల్లెకు పోదాం' అనే కార్యక్రమం చేపట్టారు. మాజీ ఎంపీ దుర్గారామక్రిష్ణ మాటాడుతూ ప్రజా సమస్యలు తెలుసుకుని వాటిని పరిష్కరించడానికే పల్లెకుపోదాం కార్యక్రమానికి శ్రీకారం చుట్టామన్నారు. సావర్కర్ ట్రస్టు అధ్యక్షుడు దేవరాజ్, బీజేపీ నాయకులు ప్రభాకర్, నిత్యానంద పిళ్లై, మానసి, రమ, విజయ కుమారి, మురళి, వినాయకం పాల్గొన్నారు.

సీడాప్ శిక్షణతో సాఫ్ట్‌వేర్ ఉద్యోగం

చిత్తూరు (సెంట్రల్), ఫిబ్రవరి 9: ఉమ్మడి చిత్తూరు జిల్లాలో నిరుద్యోగ యువకు సాఫ్ట్‌వేర్ రంగంలో ఉపాధి కల్పించే దిశగా సీడాప్ పనిచేస్తోందని డీఆర్‌డీఏ పీడీ తులసి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉమ్మడి చిత్తూరు జిల్లాలో 50 మందికి కోడింగ్ కోర్సులో శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. 17-27 మధ్య వయస్సు కలిగి, ఆసక్తిగల అభ్యర్థులు ఏడాది శిక్షణ కోసం 99635 61755, 91609 12690 నంబర్లకు ఫోన్ చేసి పేర్లు నమోదు చేసుకోవాలని కోరారు.

ఎకరా చెరుకు తోట దగ్ధం

నగరి, ఫిబ్రవరి 9: మండల పరిధిలోని ఎం కొత్తూరు గ్రామానికి చెందిన రైతు సుబ్రమణ్యం ఎకరా చెరుకు తోట శుక్రవారం దగ్ధమైంది. ప్రమాదవశాత్తు అగ్ని ప్రమాదం జరగడంతో పంట పూర్తిగా అగ్నికి ఆహుతైంది. నగరి అగ్నిమాపకశాఖ అధికారులు వచ్చి మంటలను అదుపు చేశారు. సుమారు రూ.30 వేలు నష్టం జరిగినట్లు రైతు సుబ్రమణ్యం వాపోయాడు.

జగన్‌ను నమ్మేందుకు జనం 'సిద్ధం'గా లేరు



ఇంటింటి ప్రచారం నిర్వహిస్తున్న టీడీపీ నేతలు

చిత్తూరు సిటీ, ఫిబ్రవరి9 : సీఎం జగన్ మాటలను నమ్మడానికి ప్రజలు 'సిద్ధం' గా లేరని మాజీ ఎమ్మెల్సీ దొరబాబు అన్నారు. శుక్రవారం నగరంలోని 39వ డివిజన్ హైరోడ్డు, 31, 32వ డివిజన్లు రామ్‌నగర్ కాలనీ తదితర ప్రాంతాల్లో టీడీపీ- జనసేన ఆధ్వర్యంలో గడప గడపకు 'రా.. కదలిరా' కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా దొరబాబు మాట్లాడుతూ టీడీపీ హయాంలో ఉన్న అనేక సంక్షేమ పథకాలను జగన్ రద్దుచేసి ప్రజలకు అన్యాయం చేశారన్నారు. మద్యపాన నిషేదాన్ని అమలు చేసిన తర్వాతే తిరిగి ఓట్లు అడుగుతానని చెప్పిన జగన్.. ఏ మొఖంతో ఇప్పుడు ఓట్లు అడుగుతారని ప్రశ్నించారు. సీఎం జగన్ ఎప్పుడో ప్రజల విశ్వాసాన్ని కోల్పోయారని, ఆయన్ను గద్దె దించేందుకు ప్రజలు 'సిద్ధం' గా ఉన్నారని చెప్పారు. అనంతరం స్థానికులకు టీడీపీ మినీ మ్యానిఫెస్టో కరపత్రాలను పంచిపెట్టారు. ఈ కార్యక్రమంలో నేతలు కటారి హేమలత, కాజూరు బాలాజీ, గురజాల జగన్‌మోహన్, సీఆర్ రాజన్, రాణి, మురుగేష్, సతీష్, పవన్ చిన్న, నౌషాద్, అత్తుబాయ్, ఫైరోజ్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు ఆరోగ్యంగా ఉండాలి : ఇన్‌చార్జి డీఈవో



విద్యార్థులకు మాత్రలు వేస్తున్న డీఎంఅండ్‌హెచ్‌ఓ ప్రభావతిదేవి

చిత్తూరు (సెంట్రల్), జనవరి 9: విద్యార్థులు ఆరోగ్యంగా ఉండాలనే లక్ష్యంతో వైద్య ఆరోగ్య శాఖ ద్వారా నులిపురుగుల మాత్రలు ఉచితంగా అందిస్తున్నట్లు ఇన్‌చార్జి డీఈవో విజయేంద్రరావు పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక క్యాంఫర్డ్ స్కూల్లో జిల్లా వైద్య ఆరోగ్య అధికారిణి ప్రభావతిదేవి అధ్యక్షతన జాతీయ నులిపురుగుల దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో 5237 పాఠశాలల్లో 3,63,556 మంది విద్యార్థులు ఉన్నారన్నారు. తొలి రోజున 98.2 శాతం లక్ష్యం పూర్తి చేయగా, మిగిలిన వారికి 16న ఇవ్వనున్నట్లు తెలిపారు. అనంతరం విద్యార్థులతో మాత్రలు మింగించారు. ● స్థానిక పీసీఆర్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో జరిగిన నులిపురుగుల దినోత్సవ కార్యక్రమంలో డీవీఈవో సయ్యద్ మౌల విద్యార్థులకు మాత్రలు అందించారు. ఈ కార్యక్రమంలో ఆర్‌బిఎస్‌కే కో-ఆర్డినేటర్ డాక్టర్ శిరీష, డాక్టర్ లోకేష్, తదితరులు పాల్గొన్నారు.

7వ తేదీలోపు మీటర్ రీడింగ్ పూర్తి చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఈఈ పద్మనాభపిళ్లై

చిత్తూరు రూరల్, ఫిబ్రవరి 9: ప్రతి నెలా 7వ తేదీ లోపు మీటర్ రీడింగ్ పూర్తి చేయాలని చిత్తూరు ఆపరేషన్ డివిజన్ ఈఈ పద్మనాభ పిళ్లై ఆదేశించారు. శుక్రవారం స్థానిక గాంధీ రోడులోని విద్యుత్ కార్యాలయంలో అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రీడింగ్ ఆలస్యమైతే బిల్లులు చెల్లింపులు కూడా ఆలస్యమవుతాయన్నారు. అలాగే పెండింగ్‌లో ఉన్న విద్యుత్ బకాయి లను వసూలు చేయాలని ఆదేశించారు. ప్రభుత్వం, ప్రైవేటు బకాయిలు కలిపి రూ.250 కోట్లు మేర ఉన్నాయని తెలిపారు. ఈ సమావేశంలో డీఈలు శేషాద్రి, జ్ఞానేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు నాణ్యమైన భోజనం వడ్డించాలి : డీఈవో



మాట్లాడుతున్న డీఈవో దేవరాజు

చిత్తూరు(సెంట్రల్), ఫిబ్రవరి 9: ప్రభుత్వ పాఠశాలలోని విద్యార్థులకు అందించే భోజనం నాణ్యంగా ఉండాలని డీఈవో దేవరాజు ఆదేశించారు. శుక్రవారం స్థానిక బాలాజీ కాలనీలోని సమావేశ మందిరంలో సెకండ్ ఎంఈవోల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డీఈవో మాట్లాడుతూ మధ్యాహ్న భోజనం నాణ్యతతో పాటు వారికి అందించే గుడ్లు, చిక్కీలు సైతం నాణ్యంగా ఉండాలన్నారు. చిక్కీల కోసం పెట్టే ఇండెంట్లు సరైందిగా ఉండాలని, విద్యార్థుల హాజరు వారం రోజుల పాటు ప్రామాణికంగా తీసుకుని ఇండెంట్ పెట్టాలన్నారు. గుడ్లకు సంబంధించి ఏ రోజుకు కేటాయించిన వాటిని అదేరోజు వాడాలే తప్ప వేరేవి వాడరాదని సూచించారు. పాఠశాలలను శుభ్రంగా ఉంచుకోవాలని, పరీక్షలు దగ్గర పడుతున్న క్రమంలో విద్యార్థుల చదువులపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. ఈ సమావేశంలో ఇన్‌చార్జి డీఈవో విజయేంద్రరావు, ఏడీ వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

25 నెలల బకాయిలు చెల్లించండి



ధర్నా నిర్వహిస్తున్న గ్రీన్ అంబాసిడర్లు

చిత్తూరు కలెక్టరేట్, ఫిబ్రవరి 9: తమకు రావాల్సిన 25 నెలల బకాయిలు వెంటనే చెల్లించాలని గ్రీన్ అంబాసిడర్లు శుక్రవారం స్థానిక జెడ్పీ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి టి.కోదండయ్య, జిల్లా గౌరవ అధ్యక్షుడు నాగరాజు మాట్లాడుతూ సంక్రాంతి లోగా ఆరు నెలలు జీతాలు చెల్లిస్తామని అధికారులు హామీ ఇచ్చినా ఇంతవరకు నెరవేరలేదన్నారు. అనంతరం కో-ఆర్డినేటర్ అనితకు వినతిపత్రం అందజేశారు. నాయకులు గోవిందస్వామి, రమాదేవి, రాజేంద్ర తదితరులు పాల్గొన్నారు.

నిర్బంధ కార్మిక వ్యవస్థ నిర్మూలనకు సహకరించాలి



మాట్లాడుతున్న డీఎల్‌ఎస్‌ఏ సెక్రటరీ కరుణకుమార్

చిత్తూరు లీగల్, ఫిబ్రవరి 9: నిర్బంధ కార్మిక వ్యవస్థ నిర్మూలనకు ప్రతి ఒక్కరూ తమవంతు కృషిచేసి సహకరించాలని డీఎల్ఎస్ఏ సెక్రటరీ, సీనియర్ సివిల్ జడ్జి కరుణకుమార్ కోరారు. జిల్లా న్యాయసేవాధికార సంస్థ ఆధ్వ ర్యంలో శుక్రవారం డీఎల్ఎస్ఏ కార్యాల యంలో నిర్బంధ కార్మిక వ్యవస్థ నిర్మూలన దినోత్సవం సందర్భంగా పలువురు అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిర్బంధ కార్మిక హక్కులను కాపాడాల్సిన బాధ్యత ప్రతిఒక్కరిపై ఉందన్నారు. సామాజిక సర్వే ప్రకారం జిల్లాలో బంధించబడిన కార్మికులు లేరన్నారు. ఎక్కడైనా ఉంటే పోలీసు, రెవిన్యూ అధికారులకు సమాచారం అందించాలన్నారు. వారికి విముక్తి కలిగించడానికి తమవంతు కృషి చేయాలన్నారు. ఈ సమావేశంలో జిల్లా కార్మికశాఖ అధికారి జగదీష్‌బాబు, ఎన్జీవోలు ధనశేఖర్, శేషాద్రి, చెంగయ్య, కోదండపాణి, మునిక్రిష్ణ, భూపతి, ఎంఎస్. మణి, పలుశాఖల అధికారులు పాల్గొన్నారు.

వైభవంగా నాగాలమ్మకు అభిషేకం



అన్నదానం స్వీకరిస్తున్న భక్తులు

గంగాధరనెల్లూరు, ఫిబ్రవరి 9: మండలంలోని తూగుండ్రం గ్రామ సమీపంలోని నాగాలమ్మకు అభిషేకం, పూజలు వైభవంగా నిర్వహించారు. తూగుండ్రం గ్రామానికి చెందిన కారకట్టి వంశస్థులైన బాలక్రిష్ణారెడ్డి, నీరజాక్షులురెడ్డి, దేవరాజులురెడ్డి కుటుంబసభ్యులు ఆధ్వర్యంలో ఆలయ వార్షికోత్సవం సందర్భంగా పొంగళ్లు సమర్పించారు. ఈపూజలకు తూగుండ్రంతో పాటు చుట్టుపక్కల గ్రామాలకు చెందిన ప్రజలు భారీగా తరలివచ్చారు. అనంతరం 300 మందికి అన్నదానం చేశారు.

ఉద్యోగాలకు 26 మంది విజయం విద్యార్థులు



చిత్తూరు (సెంట్రల్), ఫిబ్రవరి 9: బహుళ జాతి సంస్థ స్థానిక విజయం సైన్స్ అండ్ ఆర్ట్స్ డిగ్రీ కళాశాలలో నిర్వహించిన ప్రాంగణ ఎంపికలో తమ కళాశాలకు చెందిన డిగ్రీ ఫైనల్ ఇయర్ విద్యార్థులు 26 మంది ప్రముఖ కంపెనీల్లో ఉద్యోగాలకు ఎంపికైనట్లు విజయం విద్యాసంస్థల అధినేత తేజోమూర్తి తెలిపారు. వీరికి వార్షిక వేతనం రూ.2.40 లక్షలు ఇవ్వనున్నాయని తెలిపారు. కళాశాల ఈడీ శైలజామూర్తి, అధ్యాపకులు అభినందించారు.

ఓటు హక్కును వినియోగించుకోవాలి



ప్రజలకు అవగాహన కల్పిస్తున్న సీఐ రవిశంకర్ రెడ్డి

యాదమరి, ఫిబ్రవరి 9: మండలంలోని కాశిరాళ్ల గ్రామాన్ని చిత్తూరు రూరల్ వెస్ట్ సీఐ రవిశంకర్ రెడ్డి శుక్ర వారం సందర్శించారు. అక్కడి ప్రజలతో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఎన్నికల్లో తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని కోరారు. రుణాలిస్తామంటూ యాప్‌ల ద్వారా వచ్చే తప్పుడు వార్తలను నమ్మరాదని ప్రజలకు అవగాహన కల్పించారు.

టీడీపీతోనే రాష్ట్రాభివృద్ధి



నాయకులతో కలిసి ప్రచారం చేపట్టిన మురళీమోహన్

బంగారుపాళ్యం, ఫిబ్రవరి 9: టీడీపీతోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమని పూతలపట్టు నియోజకవర్గ ఇన్‌చార్జి మురళీమోహన్ అన్నారు. శుక్రవారం మండలంలోని కూర్మాయిపల్లె గ్రామంలో క్లస్టర్ ఇన్‌చార్జి ఎన్‌పీ ధరణీ నాయుడు ఆధ్వర్యంలో బాబు ష్యూరిటీ.. భవిష్యత్ గ్యారంటీ కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికీ కరపత్రాలు పంచిపెట్టారు. ఈ కార్యక్రమంలో ఏపీ కల్లుగీత కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ మహేంద్ర, మాజీ ఎంపీటీసీ లోకనాథం నాయుడు, నాయకులు జయచంద్రనాయుడు, మహేంద్ర, కమల్‌నాథరెడ్డి, హేమచంద్రనాయుడు, జనార్దన్ గౌడ్, వంశీ, గోపాల్ నాయుడు, మోహన్ పాల్గొన్నారు.

బదిలీపై వెళ్తున్న ఎంపీడీవోకు సన్మానం



పూతలపట్టు, ఫిబ్రవరి 9: పూతలపట్టు ఎంపీడీవోగా ఉంటూ జడ్పీ కార్యాలయానికి బదిలీపై వెళ్లిన ఎంపీడీవో గౌరీని పలువురు నాయకులు, ఎంపీడీవో కార్యాలయ సిబ్బంది, పారిశుధ్య కార్మికులు శుక్రవారం ఎంపీడీ కార్యాలయంలో ఘనంగా సన్మానించారు. ఎంపీపీ కుమారి, జడ్పీటీసీ దేవిక, నాయకులు తలపుల పల్లి బాబురెడ్డి, పోలవరం సుధాకర్‌రెడ్డి, దొరస్వామిరెడ్డి, జయచంద్రారెడ్డి, రాజారత్నంరెడ్డి, ఎం.ఎస్. మణి, బాలాజీ పాల్గొన్నారు.

ఎట్టకేలకు గుంతల పూడ్చివేత



గుడిపాల, ఫిబ్రవరి 9: మండలంలోని చిత్తూరు - వేలూరు జాతీయ రహదారిలో గుంతలమయంగా ఉన్న రోడ్డుకు శుక్రవారం ఆర్ అండ్ బీ అధికారులు మరమ్మతులు చేపట్టే కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. కొన్నేళ్లుగా ఈ గుంతలమయమైన రోడ్డులో పలు ప్రమా దాలు జరిగాయి. ఈ క్రమంలో రోడ్డును బాగుచేస్తుండ డంపై వాహన దారులు, ప్రయాణికులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

198వ రోజు అన్నదానం

గుడిపాల, ఫిబ్రవరి 9: మండలంలోని అన్నా క్యాంటీన్‌లో శుక్రవారం 198వ రోజు అన్నదానం చేశారు. మండల టీడీపీ అధ్యక్షుడు సుబ్రహ్మణ్యంనాయుడు ఆధ్వర్యంలో బెంగళూరుకు చెందిన శివగంగ బిల్డర్స్ యజమాని లంకిపల్లె రవినాయుడు భోజనం వితరణ చేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు గుర్రప్పనాయుడు, కిట్టు, సుధాకర్ యాదవ్, జయరామ్, సుధ, మోహన్ పాల్గొన్నారు.



గుడిపాలలో అన్నదానం చేస్తున్న టీడీపీ నాయకులు

అన్నాక్యాంటీన్‌లో భోజనం వితరణ

పూతలపట్టు, ఫిబ్రవరి 9: మండల కేంద్రంలోని అంబేడ్కర్ సర్కిల్ వద్ద ఏర్పాటుచేసిన అన్నాక్యాంటీన్‌లో శుక్రవారం సర్పంచ్‌ల సంఘం మాజీ అధ్యక్షుడు, సీనియర్ టీడీపీ నేత, ఆకనంబట్టు గ్రామానికి చెందిన శ్రీనివాసులు నాయుడు కుటుంబ సభ్యులు భోజనం వితరణ చేశారు. నాయకులు ఊట్ల నాగరాజులు నాయుడు, దగ్గుబాటి మునిక్రష్ణమ నాయుడు, వీరభద్రయ్య, ఏకాంబరం, భాస్కర్, బాలాజీ పాల్గొన్నారు.



పూతలపట్టులో అన్నదానం చేస్తున్న తెలుగుదేశం పార్టీ నాయకులు

ఎన్‌పీ జయప్రకాష్.. అన్నదానం

బంగారుపాళ్యం, ఫిబ్రవరి 9: మండలంలోని బీపీఎన్‌కే కాంప్లెక్స్ వద్ద అన్నాక్యాంటీన్‌లో శుక్రవారం మండల టీడీపీ అధ్యక్షుడు ఎన్‌పీ జయప్రకాష్ ఆధ్వర్యంలో పేదలకు అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు లోకనాథంనాయుడు, హేమచంద్రనాయుడు, కొండేటి శివ, శ్రీనివాసులు, రాధిక తదితరులు పాల్గొన్నారు.



బంగారుపాలెంలో అన్నదానం నిర్వహిస్తున్న జయప్రకాష్